
శుభవార్త మోసుకొచ్చిన క్రిస్మస్ తాత

పార్టీ విస్తరణకు కృషి చేయాలి
సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

6

చేపా.. చేపా!
ఎందుకు పెరగవ్?
నిర్వీర్యమవుతున్న పీఏబీఆర్ మత్స్యక్షేత్రం

6

ఫ్చ
కందిని దెబ్బకొట్టిన వరుస తుఫాన్లు

7


ఆకలి తీరుస్తున్న
అన్నదాత..!
- బాటసారులకు నిత్యాన్నదానం
- ఆరేళ్లుగా కొనసాగింపు
7




అనంతపురం కార్మెల మాత చర్చిలో అర్ధరాత్రి 12 గంటలకు ఏసు జననం.. సంబరం

ప్రేమ మూర్తి.. ఏసు

- నేడు ఆయన పుట్టిన రోజు.. క్రిస్మస్
- చర్చిలలో అర్ధరాత్రి ప్రత్యేక ప్రార్థనలు
- కేకులు కట్ చేసి క్రైస్తవుల సంబరాలు


రామచంద్రనగర్‌లో విద్యుద్దీపాలంకరణలో కార్మెల్ మాత చర్చి


ఫాదర్ జోసెఫ్ దైవ సందేశం

మానవాళికి ప్రేమ, శాంతి సందేశాన్ని తీసుకువచ్చిన ఏసు ప్రభువు జన్మదిన వేడుకలను నిర్వహించుకునేందుకు క్రైస్తవులు సిద్ధమయ్యారు. విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించిన చర్చిలలో మంగళవారం అర్ధరాత్రి ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించారు. ఏసు జన్మ వృత్తాంతాన్ని తెలియజేసే ఛాయా చిత్రాలు, బొమ్మల ప్రదర్శన ఏర్పాటు చేశారు. భక్తి గీతాలు ఆలపిస్తూ ఆధ్యాత్మిక ఆనందాన్ని ఆస్వాదించారు. కేక్ కట్ చేసి పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా బుధవారం క్రిస్మస్ వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు చేసుకున్నారు. ప్రార్థనా మందిరాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అనంతపురం నగరంలోని సీఎస్ఐ చర్చి, ఎస్ఐయూ చర్చి, కార్మెల్ మాత చర్చి, అంబేడ్కర్ నగర్‌లోని యేసుక్రీస్తు ప్రార్థనామందిరం తదితర మందిరాలు వేడుకలకోసం ముస్తాబయ్యాయి.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం కల్చరల్


బాల ఏసుకు బంతిపూల పానుపు




స్వాగతం.. ప్రభువా..

గంజాయి కట్టడికి
స్పెషల్ టీం
- ఎస్పీ జగదీష్


పోలీస్‌క్వార్టర్స్‌ను తనిఖీచేస్తున్న ఎస్పీ

తాడిపత్రి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గంజాయి నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల కట్టడికి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామని ఎస్పీ జగదీష్ తెలిపారు. పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల ఒడిశా నుంచి మన రాష్ట్రంలోకి రైళ్లల్లో గంజాయి సరఫరా అవుతోందని తమ దృష్టికి వచ్చిందని, స్పెషల్ టీంతో రైల్వేస్టేషన్‌లలో నిఘా పెట్టామని అన్నారు. ఇప్పటికే గుంతకల్లు రైల్వేస్టేషన్‌లో 3 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని, విక్రేతలను అరెస్టు చేశామని తెలిపారు. జాగిలాల సాయంతో రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండ్, పార్శిల్ సర్వీసు, ట్రాన్స్‌పోర్టు కార్యాలయాలు, కార్గో సర్వీసులు, గోడౌన్‌లు, లాడ్జిలలో ముమ్మరంగా తనిఖీ చేస్తున్నామని అన్నారు. డ్రోన్‌ల సాయంతో పట్టణ శివారు ప్రాంతాలలో అసాంఘిక కార్యకలాపాలపై దృష్టి పెట్టామని తెలిపారు. గంజాయి వల్ల యువత చెడిపోతోందని, జీవితాలు నాశనం చేసుకుంటున్నారని అన్నారు. అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. నేరాలు, కేసుల గురించి ఆరాతీశారు. రికార్డులను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. పట్టణంలోని పోలీస్ క్వార్టర్స్‌ను తనిఖీచేశారు. ఆయన వెంట ఎస్పీ సీసీ ఆంజనేయప్రసాద్, డీఎస్పీ రామకృష్ణుడు, సీఐలు శివగంగాధర్‌రెడ్డి, ఈరన్న, రామసుబ్బయ్య, ఎస్ఐలు ఉన్నారు.

పైసలిస్తే.. ఫటాఫట్..!

డ్వామాలో అడ్డగోలు బాధ్యతలు

- ఇష్టారాజ్యంగా బదిలీలు.. ఇన్‌చార్జిల నియామకం
- సీఆర్‌డీ, కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు
- హెచ్‌ఆర్ విభాగంలో అంతులేని అవినీతి





డ్వామా కార్యాలయం

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): డ్వామాలో నిత్యం ఏదో ఒక వివాదం తలెత్తుతోంది. ఉద్యోగుల బదిలీలు, సస్పెన్షన్లు, సస్పెన్షన్‌ల ఎత్తివేత, ఇన్‌చార్జి బాధ్యతలు, డెప్యుటేషన్‌లు.. ఇలా ఏ అంశమైనా అవినీతి, అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు వస్తున్నాయి. హెచ్ ఆర్ విభాగం వివాదాలకు వేదిక అవుతోంది. ఈ విభాగం అవినీతిపై రాష్ట్ర ఉన్నతాధికారులకు బాధిత ఉద్యోగులు పలుమార్లు పిర్యాదు చేశారు. బదిలీలను నిషేధిస్తూ రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ (సీఆర్‌డీ) నుంచి డ్వామాకు ఉత్తర్వులు అందాయి. తనకు తెలియకుండా ఏ ఉద్యోగినీ బదిలీ చేయొద్దని, ఇన్‌చార్జిలుగా నియమించవద్దని కలెక్టర్ సైతం ఆదేశించారు. కానీ హెచ్ ఆర్ విభాగం ఖాతరు చేయడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ విభాగంలో ఐదేళ్లకు పైగా కొందరు పాతుకుపోయారు. అందుకే అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని అంటున్నారు. వైసీపీ హయాంలో హెచ్‌ఆర్ విభాగంలో చక్రం తిప్పిన అధికారులే నేటికీ కొనసాగుతున్నారు.

ప్రతి పనికీ రేటు

ఉద్యోగుల బదిలీలు, సస్పెన్షన్‌లు సహా ప్రతి అంశాన్నీ డ్వామాలో హెచ్‌ఆర్ విభాగం నడిపిస్తోంది. ఇదే అదనుగా కొందరు వ్యాపారానికి తెరలేపారు. ప్రతి పనికీ ఓ రేటు ఫిక్స్ చేసుకున్నారు. బదిలీ చేయాలన్నా, సస్పెన్షన్ ఎత్తివేయాలన్నా హెచ్‌ఆర్ విభాగానికి ముడుపులు పుచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. వైసీపీ అధికారంలోకి వచ్చిన కొత్తలో.. 2019లో నియమితులైన హెచ్‌ఆర్ విభాగం అధికారులు ఐదేళ్లు పూర్తి అయినా కదలడంలేదు. సీట్లలో పాతుకుపోయిన అధికారులు, ఉద్యోగులను ఎవరూ కదిలించే ప్రయత్నం చేయడంలేదు. అవినీతికి అడ్డులేకుండా పోతోందని ఫిర్యాదులు వెళ్లడంతో, హెచ్‌ఆర్ విభాగాన్ని ప్రక్షాళన చేయాలని పలుమార్లు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. అయినా జిల్లా అధికారులు పట్టించుకోవడం లేదు.

అడ్డగోలు బదిలీలు

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల బదిలీలపై నిషేధం విధించింది. కానీ డ్వామాలో గుట్టుచప్పుడు కాకుండా బదిలీలు, డెప్యుటేషన్‌లు, ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడం వంటివి కొనసాగుతున్నాయి. నిబంధనల ఉల్లంఘన జరుగుతున్నా జిల్లా అధికార యంత్రాంగం కన్నెత్తిచూడటం లేదు. ఏపీడీలు, ఏపీఓలకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడంలోనూ నిబంధనలు అతిక్రమించినట్లు తెలుస్తోంది. సాధారణంగా అదే మండలంలో పనిచేస్తున్న ఈసీకి ఏపీఓగా ఇన్‌చార్జి బాధ్యతలు ఇవ్వాలి. లేదా పక్క మండలం ఏపీఓకు అదనపు బాధ్యతలు ఇవ్వాలి. ఇలా చేసే అవకాశం లేకపోతే అదే మండలంలోని పనిచేసే టీఏకి ఏపీఓగా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించాలి. కానీ ఈ నిబంధనలను తుంగలో తొక్కారు. బ్రహ్మసముద్రం ఏపీఓగా ఒకరు ఉన్నా.. పీడీ కార్యాలయంలో పనిచేస్తున్న ఓ ఉద్యోగినికి అక్కడకు బదిలీ చేశారు. కుందుర్పిలో పనిచేస్తున్న ఏపీఓ విధులకు డుమ్మా కొట్టినట్లు క్లస్టర్ ఏపీడీ నివేదిక ఇచ్చినా.. ఆ ఏపీఓకి జీతం చెల్లిస్తున్నారు. ఇదంతా హెచ్ ఆర్ విభాగంలో జరుగుతున్న మాయాజాలం కావడం గమనార్హం.

బదిలీలు చేయలేదు..



డ్వామాలో బదిలీలు చేయడం లేదు. ప్రభుత్వం, కలెక్టర్ అనుమతి లేకుండా బదిలీలు చేయరాదని ఉత్తర్వులు ఉన్నాయి. క్లస్టర్లకు ఏపీడీలను ప్రభుత్వం నియమించలేదు. దీంతో ఉన్న అధికారులనే ఇన్‌చార్జిలుగా నియమించి సర్దుకుంటున్నాం. పని ఎక్కడా ఆగకూడదని, పాలనపరమైన విధాన నిర్ణయాలు తీసుకుంటున్నాం. కలెక్టర్ అనుమతితోనే ముందుకు వెళ్తున్నాం. ఇందులో ఎలాంటి అక్రమాలకు అవకాశం లేదు. ప్రభుత్వం నుంచి అనుమతి వస్తే ఉద్యోగుల బదిలీలు చేపడుతాం.

- సలీంబాషా, డ్వామా పీడీ

ఇన్‌చార్జిలే దిక్కు..

డ్వామాలో చాలా పోస్టులలో ఇన్‌చార్జిలు కొనసాగుతున్నారు. కీలకమైన ఏఓ, ఎఫ్ఎం, ఉరవకొండ ఏపీడీ, తాడిపత్రి, గుత్తి క్లస్టర్లలో ఏపీడీలు ఇన్‌చార్జిలే. డ్వామాలో ఏఓ విజయలక్ష్మి మూడు నెలల క్రితం గుంతకల్లు డీఎల్‌డీఓగా బదిలీ అయ్యారు. డ్వామాలో వాటర్‌షెడ్ అడిషినల్ ఏపీడీగా ఉన్న సుధాకర్‌రెడ్డికి ఏఓగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఎఫ్ఎంగా ఉన్న వెంకటనాయుడు ప్రకాశం జిల్లా డీపీఓగా బదిలీపై వెళ్లారు. అవినీతి, అక్రమాల ఆరోపణలు ఎదుర్కొంటున్న విజిలెన్స్ విభాగం అధికారి రమణారెడ్డికి ఎఫ్ఎంగా ఇన్‌చార్జి బాధ్యతలు కట్టబెట్టారు. తాడిపత్రి, గుత్తికి విజయ్‌కుమార్ ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. ఉపాధి పథకం సూపరింటెండెంట్ శైలజ ఉరవకొండ ఇన్‌చార్జి ఏపీడీగా ఉన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఏపీడీగా రాజ్యమేలి, అప్పటి పీడీకి కొమ్ముకాసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఓ ఏపీఓ తిరిగి ఏపీడీగా రావాలని కూటమి ఎమ్మెల్యేల లేఖలు సేకరిస్తున్నట్లు సమాచారం.

అభివృద్ధి బాటలు

వైసీపీ ఐదేళ్ల నిర్లక్ష్యం..

వైసీపీ పాలనలో పంచాయతీల అభివృద్ధికి పైసా కూడా విడుదల చేయలేదు. పైగా కేంద్రం కేటాయించిన నిధులనూ పక్కదారి పట్టించింది. దీంతో పంచాయతీల్లో అభివృద్ధి కుంటుపడింది. వీధి దారులన్నీ అధ్వానంగా తయారయ్యాయి. గుంతలమయం అయ్యాయి. చిన్నపాటి వానకూ వీధులన్నీ బురదమయం అయ్యేవి. రోడ్లపై వాననీరు, మురుగునీరు నిల్వ ఉంటుండటంతో గ్రామీణులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. పలుమార్లు గ్రామస్థులు వైసీపీ పాలకుల దృష్టికి ఈ సమస్యలు తీసుకెళ్లినా.. ఫలితం లేకపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ సమస్యలపై దృష్టి సారించింది. గ్రామాల్లో సీసీ రోడ్లు, మురుగు కాలువలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటోంది. జాతీయ ఉపాధి హామీ నిధులతో గ్రామాల్లో అంతర్గత రోడ్ల నిర్మాణానికి నిధులు పెద్ద ఎత్తున విడుదల చేసింది. పనులు చకచకా సాగుతున్నాయి.

- ఆంధ్రజ్యోతి, కూడేరు/కణేకల్లు


కూడేరు పార్కు కాలనీలో (నాడు)


సీసీ రోడ్డు పనులు అనంతరం (నేడు)

- శిథిలావస్థలో గ్రామీణ వీధులు
- కూటమి రాకతో సీసీ రోడ్లు
- గ్రామీణుల హర్షం

కూడేరు మండలంలో...

కూడేరు మండలానికి 14 పంచాయతీలకు రూ.2.06 కోట్ల నిధులను విడుదల చేశారు. ఇందులో కూడేరు పంచాయతీకి రూ.35 లక్షలు, మరుట్ల రూ.13.50 లక్షలు, కొర్రకొడు రూ.22 లక్షలు, తిమ్మాపురం రూ.9 లక్షలు, ముద్దలాపురం రూ.12 లక్షలు, ఇప్పేరు రూ.23 లక్షలు, పి. నారాయణపురం రూ.20 లక్షలు, కల్లగళ్ల రూ.10 లక్షలు, చోళసముద్రం రూ.16 లక్షలు, అరవకూరు రూ.9 లక్షలు, గొట్కూరు రూ.15 లక్షలు, ఉదిరిపికొండ రూ.14.50 లక్షలు, జల్లిపల్లికి రూ.7 లక్షలు కేటాయించారు. ఈ నిధులతో పనులు వేగంగా సాగుతున్నాయి. కూడేరు, మరుట్ల, కొర్రకోడు, ఇప్పేరు, తిమ్మాపురం, ముద్దలాపురం, పి. నారాయణపురం, చోళసముద్రంలో దాదాపు పూర్తి అయ్యాయి. ఉదిరిపికొండ పంచాయతీలో కొంతవరకు పనులు జరిగాయి. అరవకూరు, గొట్కూరు, జల్లిపల్లి, కలగళ్ల, గ్రామ పంచాయతీల్లో పనులు ప్రారంభం కావాల్సి ఉంది.


పి. నారాయణపురంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు


కణేకల్లులో సీసీ రోడ్డు నిర్మిస్తున్న కార్మికులు

కణేకల్లు మండలంలో..

కణేకల్లు మండలంలో సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఎన్ఆర్ఈజీఎస్ కింద రూ.4.10 కోట్లను కేటాయించింది. మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లోని 32 గ్రామాల్లో దాదాపు 93 సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభించింది. ఇప్పటికే 45 పనులు పూర్తికాగా మరో 48 పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ నెలాఖరుకు ఆ పనులు కూడా పూర్తయ్యే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. దీంతో పల్లె వీధులకు కొత్త కళ వచ్చింది.





పనులు పూర్తి చేస్తాం

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన సీసీ రోడ్లను మరో పది రోజుల్లో పూర్తి చేస్తాం. ఇప్పటికే చాలా పంచాయతీల్లో పనులు పూర్తి చేశాం.

- పీఆర్ ఏఈ రమణయ్య, కూడేరు

రోడ్లు ఏర్పాటు హర్షణీయం



మా గ్రామంలో సీసీ రోడ్లు వేస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది. అంతేకాకుండా గతంలో హెచ్చెల్సీ కెనాల్ నుంచి మా ఊరికి వచ్చే దారులు గుంతలు.. గుంతలుగా ఉండేది. కూటమి ప్రభుత్వం వచ్చాక రోడ్ల ఏర్పాటుతో ఆ కష్టాలన్నీ తీరాయి.

- వంద్రమ్మ, కళేకుర్తి

కొత్తకళ వచ్చింది



కణేకల్లులోని తారకరామనగర్‌కు వెళ్లే దారిలో సీసీ రోడ్డు ఏర్పాటుతో తమ కాలనీలకు కొత్తకళ వచ్చింది. అలాగే పట్టణంలోని పలు వీధుల్లో కూడా సీసీరోడ్లు వేస్తున్నారు. ఇంత పెద్ద ఎత్తున సీసీ రోడ్ల ఏర్పాటు చేయడం నేను ఇంతవరకూ చూడలేదు.

- కుమార్, కణేకల్లు

వారంలోపే బిల్లులు



సీసీరోడ్లు నిర్మించిన కాంట్రాక్టర్లకు కేవలం వారంలోపే బిల్లులు పడుతున్నాయి. దీంతో కాంట్రాక్టర్లు ఎంతో ఉత్సాహంగా రోడ్లను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే 50 శాతం పనులు పూర్తి అయ్యాయి. డిసెంబరు ఆఖరికల్లా అన్ని పనులు పూర్తి అవుతాయి.

- జగదీష్, పీఆర్ జేఈ, కణేకల్లు



కుంగిపోయిన బ్రిడ్జి

కుంగిన హగరి వంతెన

బొమ్మనహాళ్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కళ్లుదేవనహళ్లి-బండూరు గ్రామాల మధ్య వేదవతి హగరి నదిపై వంతెన కుంగిపోయింది. భారీ వాహనాల రాకపోకలతో కూలేపోయే దశకు చేరుకుంది. వంతెనపై డివైడర్ మంగళవారం అకస్మాత్తుగా పక్కన కుంగి రెండుభాగాలుగా విడిపోయాయి. ఏ క్షణంలోనైనా ప్రమాదం జరగవచ్చని కళ్లుదేవనహళ్లి, బండూరు, గోవిందవాడ, కళ్లుహోళ తదితర గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ బ్రిడ్జిని 40 ఏళ్ల క్రితం నిర్మించారని స్థానికులు అంటున్నారు. బొమ్మనహాళ్ మండలం నుంచి ఉరవకొండ, గుంతకల్లు ప్రాంతాలకు వెళ్లేందుకు ఈ వంతెనే ఆధారం. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని వంతెనను నిర్మించేలా చూడాలని కోరుతున్నారు.



ఇటీవల పోలీసులు సీజ్‌చేసిన ఇసుక ట్రాక్టర్లు

సరిహద్దు దాటుతున్న ఇసుక

యాడికి మండలం మీదుగా ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. చీకటి పడగానే గుట్టు చప్పుడు కాకుండా సరిహద్దులు దాటుతోంది. పెద్దపప్పూరు, తాడిపత్రి రూరల్ మండలాల నుంచి ఇసుకను రాత్రి 8 నుంచి తెల్లవారుజామున 5 గంటల వరకూ అక్రమంగా తరలిస్తున్నారు. రాయలచెరువు, చందన, దైవాలమడుగు గ్రామాల మీదుగా నంద్యాల జిల్లాకు తరలిస్తున్నారని సమాచారం. పోలీసుల తనిఖీల సమయంలో.. కళ్లుకప్పేందుకు ఇసుక లోడుతో ఉన్న ట్రాక్టర్లను పొలాలు, వంకల్లో ఆపుతున్నారు. పోలీసులు వెళ్లిపోయాక రవాణా చేస్తున్నారు. తనిఖీల్లో పట్టుబడిన వాహనాలను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్ వద్ద పెడుతున్నారు. ఇసుక అక్రమ రవాణాదారులకు పోలీసు తనిఖీల సమాచారం ముందుగానే తెలుస్తోందని, అందుకే దొరక్కుండా తప్పించుకుంటున్నారని సమాచారం.

- ఆంధ్రజ్యోతి, యాడికి

న్యూస్‌బాక్స్

27న విచారణకు రండి

డీఎంహెచ్‌ఓకు పిలుపు

అనంతపురం టౌన్, డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): డీఎంహెచ్‌ఓ డాక్టరు ఈ.బీ. దేవిపై ఓ సబ్‌యూనిట్ అధికారి ఇచ్చిన పిర్యాదులపై విచారణకు జిల్లా అధికారులు సిద్ధమయ్యారు. డీఆర్‌ఓ మలోల విచారణ చేపడుతున్నారు. ఈనెల 27న హాజరు కావాలని డీఎంహెచ్‌ఓకు సమాచారం పంపారు.

టమోటా కిలో రూ.13

అనంతపురం రూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 13తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు మంగళవా రం 1650 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 9, కనిష్ఠ ధర రూ. 5 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ.28వేలు

అనంతపురం రూరల్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 28,310 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 12వేలు, సరాసరి రూ. 19వేలుతో అమ్ముడు పోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 18 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

ఫైన్‌తో ఫీజు చెల్లించండి

అనంతపురం విద్య, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి-2025 పరీక్షలకు ఈ నెల 27వ తేదీ నుంచి రూ. 1000 ఫీజు చెల్లించవచ్చని డీఈఓ ప్రసాద్‌బాబు, ఏసీ గోవింద్ నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 27వ తేదీ నుంచి జనవరి 10వ తేదీ వరకూ ఫీజు చెల్లించే అవకాశం ఉందన్నారు. ఇప్పటి వరకూ ఫీజు కట్టని విద్యార్థులు ఫీజు చెల్లించేలా ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

'కందుల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి'

ఉరవకొండ, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కందుల కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని ఎమ్మెల్సీ శివరామిరెడ్డి డిమాండ్ చేశారు. వజ్రకరూరు మండలం కొనకొండ్లలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ల పేరుతో ప్రభుత్వం కాలయాపన చేయడం తగదన్నారు. ఖరీఫ్ సీజన్‌లో అత్యధికంగా కంది పంటను సాగు చేశారన్నారు. పండించిన పంటను ప్రభుత్వం కొనుగోలు చేయడానికి ప్రభుత్వం ముందుకు రాకపోవడంతో రైతులు దళారులకు అమ్ముతున్నారన్నారు. ఇదే అదునుగా దళారులు తక్కువ రేటుకు కొనుగోలు చేసి రైతులను మోసం చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

వెబ్‌సైట్‌లో పరీక్షల ఫైనల్ కీ

అనంతపురం విద్య, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపకార వేతన పరీక్షల (ఎన్‌ఎంఎంఎస్) ఫైనల్ కీ డీజీఈ కార్యాలయ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉందని డీఈఓ ప్రసాద్‌బాబు తెలిపారు. డీజీఈ కార్యాలయ వెబ్‌సైట్ www.bse.ap.gov.inలో ఉంచారన్నారు. విద్యార్థులు పరిశీలించాలని సూచించారు.

27న విజయవాడలో రాష్ట్రస్థాయి వాలీబాల్ ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): శాప్ ఆధ్వర్యంలో ఈనెల 27న విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో రాష్ట్రస్థాయి సీనియర్ వాలీబాల్ క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు డీఎస్‌డీఓ ఉదయ్‌భాస్కర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పురుషులు, మహిళలు వారి జనన, ఆధార్‌కార్డు, నివాసధృవీకరణ పత్రాలతో ఉదయం 7గంటలకు హాజరుకావాలని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు రాజస్థాన్‌లోని జైపూర్‌లో నిర్వహించే జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. వివరాలకు సెల్ నంబరు 9381747940ను సంప్రదించాలని కోరారు.

ఎల్ఎల్‌సీ ఈఈగా నారాయణనాయక్

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): టీబీ డ్యాం పరిధిలోని ఎల్ఎల్‌సీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ)గా నారాయణనాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర జలవనరులశాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని మైనర్ ఇరిగేషన్ ధర్మవరం డివిజన్ ఈఈగా పని చేస్తున్న నారాయణనాయక్‌ను టీబీ డ్యాం పరిధిలోని బళ్లారి సర్కిల్ ఎల్ఎల్‌సీ (లో లెవెల్ కెనాల్) ఈఈగా బదిలీ చేశారు. ఇక హెచ్చెల్సీలోని ధర్మవరం బ్రాంచ్ కెనాల్ ఈఈగా ఉన్న అబ్దుస్ సమీకి మైనర్ ఇరిగేషన్ ధర్మవరం డివిజన్ ఈఈగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

పార్టీ విస్తరణకు కృషి చేయాలి



ప్రసంగిస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



హాజరైన నాయకులు, కార్యకర్తలు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

అనంతపురం కల్చరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రజాసమస్యలపై పోరాటాలు సాగిస్తూనే పార్టీ విస్తరణకు కృషి చేయాలని సీపీఎం నాయకులు, కార్యకర్తలకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. నగరంలోని ఎస్ఎస్ గ్రాండ్ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం నుంచి నిర్వహిస్తున్న సీపీఎం జిల్లా 14వ మహాసభలు మంగళవారం సాయంత్రం ముగిసాయి. మహాసభల్లో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావుతోపాటు కార్యదర్శివర్గ సభ్యుడు వెంకటేశ్వరరావు పరిశీలకులుగా వ్యవహరించారు. రెండురోజుల పాటు పార్టీకి సంబంధించిన వివిధ అంశాలపై జరిగిన చర్చలను వారు పరిశీలించారు. గడిచిన మూడేళ్లలో పార్టీ చేపట్టిన కార్యక్రమాలపై నాయకులు, కార్యకర్తలతో చర్చించడంతోపాటు భవిష్యత్ కార్యాచరణను రూపొందించారు. అనంతరం శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశంలో మతతత్వ ప్రమాదం మరింతగా ముంచుకొస్తోందన్నారు. బీజేపీ తెస్తున్న మత విభజన రాజకీయాలను తిప్పికొట్టి, ఐక్యతను తీసుకొచ్చే కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో జరపాలన్నారు. అధికార టీడీపీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలేదని విమర్శించారు. ప్రజలపై అధిక విద్యుత్ భారాలు మోపుతోందన్నారు. వీటిపై దృష్టి సారించి పోరాటాలు రూపొందించాల్సిన అవసరముందన్నారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గడిచిన మూడేళ్లలో సీపీఎం అనేక కార్యక్రమాలు రూపొందించిందన్నారు. అనంతరం 26 మందితో సీపీఎం జిల్లా నూతన కమిటీ, 9 మందితో కార్యదర్శివర్గం ఎన్నికను నిర్వహించారు. అనంతరం పామిడికి చెందిన అనిమిరెడ్డిని రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, గార్లదిన్నెకు చెందిన నాగమ్మను రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వెంకటేశ్వరరావు సన్మానించారు.

సంక్షేమ పథకాల్లో కోత పెడితే సహించం

అనంతపురం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాల్లో కోత పెడితే సహించేది లేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనర్హుల గుర్తింపు పేరుతో జరుగుతున్న సర్వేను ఆయన తప్పుబట్టారు. అనంతపురం జిల్లా కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బడ్జెట్‌ను మిగిల్చే క్రమంలో సర్వే పేరుతో అనర్హుల గుర్తింపు కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపడుతున్నట్లు స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు. జాబితాను పార్టీలపరంగా గుర్తించి, రాజకీయ వేధింపులకు ఉపయోగించుకునే అవకాశాలు లేకపోలేదని అనుమానం వ్యక్త చేశారు. వైసీపీ ప్రభుత్వం ఇదే రకమైన చర్యలకు పాల్పడిందని అన్నారు. సర్వే పేరుతో కుటుంబ సమాచారాన్ని సేకరించి బయట కంపెనీలకు అప్పగించే ప్రమాదం ఉందని అన్నారు. వైసీపీ ప్రభుత్వం తరహాలో సర్వే పేరుతో డేటా సేకరించి ప్రైవేట్ సంస్థలకు అప్పగించి సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. అందుకే తాము డేటా ప్రైవసీ యాక్ట్‌ను అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. అమెరికా, యూకే ఎన్నికల్లో కూడా ఈ రకమైన డేటా ప్రభావితం చేసిందని గుర్తు చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు డేటాను సంరక్షించే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం దొడ్డిదారిన వ్యవసాయరంగాన్ని ప్రైవేట్‌పరం చేయాలని చూస్తోందని ఆరోపించారు. రైతులు పోరాటం చేసి తిప్పికొట్టిన మూడు వ్యవసాయ చట్టాలను దొడ్డిదారిన అగ్రికల్చర్ మార్కెటింగ్ రీఫార్మ్స్ పేరుతో దేశంలో అమలు చేయాలని చూస్తోందని అన్నారు. చట్టంతో పనిలేకుండా, రాష్ట్ర ప్రభుత్వాల ఆమోదంతో దొడ్డిదారిన అమలు చేయించే ప్రయత్నాలు జోరుగా సాగుతున్నాయని అన్నారు. ఏపీ ప్రభుత్వం దీన్ని వ్యతిరేకించాలని కోరారు. రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ పట్ల కేంద్ర హోంమంత్రి చేసిన అనుచిత వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని తమ పార్టీ డిమాండ్ చేస్తోందని అన్నారు. కేంద్ర హోంమంత్రి వ్యాఖ్యలను నిరసిస్తూ ఈ నెల 30న దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని సీపీఎం నిర్ణయించిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎన్నడూ లేనివిధంగా ట్రూ అప్ ఛార్జీల పేరుతో రూ.16 వేల కోట్ల భారాన్ని ప్రజలపై మోపిందని అన్నారు. స్మార్ట్ మీటర్లు పెడితే ధ్వంసం చేయాలని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నారా లోకేశ్ చెప్పిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన మాటను నిలబెట్టుకోకుండా యధావిధిగా అమలు చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ భారాన్ని తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు.

చేపా..చేపా!

ఎందుకు పెరగవ్?

నిర్వీర్యమవుతున్న పీఏబీఆర్ మత్స్యక్షేత్రం

109 చేపల పాండ్లలో...
వినియోగంలో ఉన్నది 37
తగ్గిపోతున్న చేపపిల్లల పెంపకం
పోస్టులన్నీ ఖాళీ.. భర్తీ చేసే నాథుడే లేడు
ఇదీ పీఏబీఆర్ మత్స్యక్షేత్రం దుస్థితి

> అనగనగా ఓ చేప. ఎన్నాళ్లున్నా అది ఒకటే ఉంటోంది. దాని సంతానం పెరగడంలేదు. ఎందుకిలా అని యోచించి దాని వద్దకెళ్లి ఎందుకు పెరగడం లేదని ప్రశ్నిస్తే దాని గోడంతా వెళ్లబోసుకుంది. దాని గోడంతా మీకోసం..

అనంతపురం ప్రెస్‌క్లబ్/కూడేరు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మత్స్యసంపదను వృద్ధిచేసేందుకు ఏర్పాటుచేసిన మత్స్యక్షేత్రాల్లో పీఏబీఆర్ క్షేత్రమే పెద్దది. ఇక్కడ పక్కనే పెద్ద జలాశయముంది. ఎప్పటికీ నీరు సమృద్ధిగా ఉంటుంది. కావలసినంత స్థలం ఉంది. చేపల పెంపకానికి 109 చేపల పాండ్లున్నాయి. అయినా చేపల పెంపకం మాత్రం జరగడంలేదు. ఎక్కడా చూసినా ముళ్ల కంపలు... చెత్తాచెదారం, నెర్రెలు చీలిన పాండ్లు దర్శనమిస్తున్నాయి. సరైన పర్యవేక్షణ, మౌలిక వసతులు, మెయింటెనెన్స్ లేకపోవడంతో ఆ క్షేత్రం శిథిలావస్థకు చేరుకుంటోంది. పాండ్లన్నీ నిర్వీర్యమైపోవడంతో చేపపిల్లల పెంపకం ఏడాదికేడాది తగ్గుతూ వస్తోంది.



అతి తక్కువ చేపపిల్లల పెంపకం చేపడుతున్న పాండ్లు ఇవే

37 మాత్రమే వినియోగంలో..

ఈ క్షేత్రంలో దాదాపు నూట తొమ్మిది పాండ్లు ఉన్నాయి. అయితే వీటి ఆలనాపాలనా చూసుకునే వారు లేకపోవడంతో అవి ఒక్కొక్కటి శిథిలమవుతూ వస్తున్నాయి. ఇప్పటికే దాదాపు 72 పాండ్లు శిథిలమయ్యాయి. ప్రస్తుతం అక్కడ 37 పాండ్లు మాత్రమే వినియోగంలో ఉన్నాయి. దీంతో కోట్లలో చేపల పిల్లల పెంపకం జరగాల్సిన ఈ క్షేత్రంలో 80 లక్షల చేపపిల్లలు మాత్రమే పెంపకం చేపడుతున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. అయితే విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు అక్కడ కేవలం 10 లక్షల చేపపిల్లల పెంపకం మాత్రమే జరుగుతున్నట్లు తెలుస్తోంది.



పీఏబీఆర్ మత్స్యక్షేత్రం

ఏళ్లుగా సిబ్బంది కొరత...

పీఏబీఆర్ మత్స్యక్షేత్రంలో సరైన సిబ్బంది లేకపోవడంతో సమస్య తీవ్రతరమవుతోంది. ఇక్కడ ఎఫ్‌డీఓ అధికారితో పాటు ఒక ఫీల్డ్ మెన్, నలుగురు షిఫర్‌మ్యాన్‌లు, ఒక వాచ్‌మెన్ ఉండాలి. అయితే ఆయా పోస్టుల్లో ఉన్న సిబ్బంది పదవీ విరమణ చేయడంతో ఆ పోస్టులు ఖాళీ ఏర్పడ్డాయి. అయితే ఆ ఖాళీలను భర్తీ చేయకపోవడంతో పర్యవేక్షణ సమస్య ఏర్పడుతోంది. ప్రస్తుతం ఇక్కడ రెగ్యులర్ ఎఫ్‌డీఓ లేకపోవడంతో ఇన్‌చార్జ్ ఎఫ్‌డీఓ ఉన్నారు. ఒక ఫీల్డ్ మెన్, ఒక షిఫర్‌మ్యాన్ మాత్రమే ఉన్నారు. ఉండాల్సిన ఒక వాచ్‌మెన్ లేకపోవడంతో భద్రతా సమస్య తలెత్తుతోంది. ఆ క్షేత్రంలోకి ఎవరొస్తున్నారో... ఎవరు వెళ్తున్నారో తెలియని పరిస్థితి నెలకొంది. పలు సందర్భాల్లో భద్రత లేకపోవడంతో చేపపిల్లలు దొంగతనాలకు గురవుతున్నాయి.

నివేదిక పంపాం... త్వరలోనే పరిష్కారమవుతుంది

పీఏబీఆర్ మత్స్యక్షేత్రానికి సంబంధించి పాండ్ల సమస్య ఉంది. ఇందుకు సంబంధించిన నివేదికలు తయారు చేసి రాష్ట్ర అధికారులకు పంపాం. వచ్చే ఏడాది మార్చి, ఏప్రిల్‌లోపు ఈ సమస్య పరిష్కారమయ్యే అవకాశం ఉంది. ఇందుకు సంబంధించి బడ్జెట్‌ను కేటాయిస్తే, పనులు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నాం.

- శ్రీనివాస్, డీడీ, మత్స్యశాఖ

పంటలు కాపాడే ప్రయత్నం

కృష్ణ జింకల నియంత్రణకు చర్యలు
క్షేత్రస్థాయిలో పరిశీలించిన డీఎఫ్‌ఓ
రైతుల్లో చిగురిస్తున్న ఆశలు..



రైతులతో మాట్లాడుతున్న డీఎఫ్‌ఓ (ఫైల్)

అనంతపురం న్యూటౌన్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు మండలాల్లో సాగు చేసిన పంటలను కృష్ణ జింకల నుంచి కాపాడుకోవడం రైతులకు సవాల్‌గా మారింది. రైతుల విన్నపం మేరకు అటవీ అధికారులు చర్యలు చేపట్టారు. వర్షాధారం మీద ఆధారపడి జిల్లాలోని వజ్రకరూర్, విడపనకల్ మండలాల్లో రైతులు వివిధ పంటలు సాగు చేస్తారు. అయితే వర్షాలు సకాలంలో కురవకపోవడంతో పంటలు ఆశించిన మేరకు చేతికి రావడం లేదు. అయినా స్థానిక రైతులు కనీసం 50 శాతమైనా చేతికందకుండా పోతుందా అనే ఆశతో వేల ఎకరాల్లో ప్రతి యేటా పంటలు సాగు చేస్తున్నారు. అయితే మొలక దశలోనే కృష్ణ జింకలు గుంపులుగా పొలాలపై దాడులు చేసి మొలక దశలోనే తినేస్తున్నాయి. వాటి పంటలను కాపాడుకోవడం రైతులకు సవాల్‌గా మారింది. దీంతో ఆయా మండలాలకు చెందిన పలువురు రైతులు ఈ నెల 9వ తేదీన జిల్లా కేంద్రానికి వచ్చి జిల్లా అధికారుల కు వినతి పత్రాలు సమర్పించారు. కృష్ణ జింకల నుంచి త మ పంటలను కాపాడాలని విన్నవించారు. అందులో భాగం గానే జిల్లా అటవీశాఖ కార్యాలయంలో జిల్లా అటవీశాఖా ధికారి విఘ్నేష్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. పదేళ్లుగా తమ గో డు చెప్పుకుంటున్నా, పరిష్కారం దొరకలేదని వాపోయారు. పదేళ్ల క్రితం వందల సంఖ్యలో ఉన్న కృష్ణ జింకలు క్రమేణా వేల సంఖ్యకు చేరాయి. వాటిని అదుపు చేసి, పంటలను కాపాడుకోవడం చాలా ఇబ్బందికరంగా ఉందని తెలిపారు. దీనిపై స్పందించిన డీఎఫ్‌ఓ మంగళవారం క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లారు. రైతులతో సమస్యపై ఆరా తీశారు. కృష్ణ జింకల దాడిలో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ముందుగా డ్రోన్ ద్వారా పరిశీలించి క్రిష్ణ జింకల సంఖ్యను అంచనా వేసేందుకు నిర్ణయించినట్లు డీఎఫ్‌ఓ పేర్కొన్నారు. అనంతరం ప్రారంభ చర్యల్లో భాగంగా ఉన్న వాటి సంఖ్య వృద్ధి చెందకుండా తగిన చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. త మ విన్నపాన్ని మన్నించి డీఎఫ్‌ఓ క్షేత్రస్థాయి పర్యట నకు వెళ్లడంతో స్థానిక రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నా రు.

క్షేత్రస్థాయి తనిఖీతో అవగాహన వచ్చింది



స్థానిక రైతులు కార్యాలయానికి వచ్చి వారి సమస్యను విన్నవించారు. దీంతో సమస్య ఎంత ఇబ్బందికరంగా ఉందో అర్థమైంది. సమస్య తీవ్రతను గమనించి వెంటనే క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాం. అక్కడ సమస్య చాలా ఇబ్బందికరంగా ఉంది. ఇప్పటికిప్పుడు పరిష్కరించలేమ ని అర్థమైంది. అయితే అవి మరింత వృద్ధి చెందకుండా , మరో సమస్య తలెత్తకుండా వెంటనే చర్యలు చేపట్టేలా ప్రణాళిక తయారుచేస్తున్నాం. వీలైనంత త్వరగా రైతుల కు న్యాయం జరిగేలా చూస్తాం.

- విఘ్నేష్, జిల్లా అటవీశాఖ అధికారి



కేక్ కట్ చేస్తున్న ఎంపీ అంబికా, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ఇతర నాయకులు

టీడీపీ కార్యాలయంలో

సెమీ క్రిస్మస్ వేడుకలు

అనంతపురం అర్బన్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): నగరంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం సాయంత్రం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, జిల్లా అధికార ప్రతినిధి సరిపూటి రమణ, టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు స్వామిదాస్, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంచెపు వెంకటేష్, మీడియా కో ఆర్డినేటర్ కూచి హరి, తెలుగు మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్వప్న తదితరులు కేక్ కట్ చేసి సెమీ క్రిస్మస్ వేడుకలు జరుపుకున్నారు. జిల్లాలోని క్రిస్టియన్లకు ఎంపీ అంబికా, పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు లింగారెడ్డి, మణికంఠబాబు, కురబ నారాయణ స్వామి, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

వినియోగదారుల చట్టంపై

అవగాహన అవసరం

ఇన్‌చార్జి కలెక్టరు శివనారాయణశర్మ



స్టాల్స్‌ను పరిశీలిస్తున్న శివనారాయణశర్మ

అనంతపురం టౌన్, డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): వినియోగదారుల చట్టంపై అందరికీ అవగాహన అవసరమని ఇన్‌చార్జి కలెక్టర్ శివనారాయణ శర్మ అన్నారు. జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని మంగళవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖలద్వారా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఇన్‌చార్జి కలెక్టర్ సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వినియోగదారుల సంక్షేమం, హక్కులపై అవగాహన కల్పించడం కోసమే జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ చట్టం ద్వారా మోసపోయిన వినియోగదారులకు సత్వర న్యాయం సాధ్యమన్నారు. అనంతరం వినియోగదారుల చట్టంపై నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలను ఇన్‌చార్జి కలెక్టర్ అందజేశారు. కార్యక్రమంలో డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు, జిల్లా కన్స్యూమర్ కమిషన్ ప్రెసిడెంట్ శ్రీలత, లీగల్‌మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ సుధాకర్, డీఈఓ ప్రసాద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

చేతులెత్తేసిన ఆంధ్ర బ్యాటర్లు

ఆరు వికెట్లు తీసిన మహారాష్ట్ర బౌలర్ సుభం



సుభంకాదం

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బీసీసీఐ కూచ్‌బెహార్ అండర్-19 టోర్నీలో ఆంధ్ర బ్యాటర్లు చేతులెత్తేశారు. మహారాష్ట్ర బౌలర్ సుభంకాదం ఆరు వికెట్లు తీయడంతో ఆంధ్రజట్టు 143 పరుగులకే ఆలౌట్ అయ్యింది. ఆంధ్ర, మహారాష్ట్ర జట్ల మధ్య క్వార్టర్ ఫైనల్ ఆర్డీటీ స్టేడియంలో మంగళవారం మూడవ రోజు కొనసాగింది. ఓవర్‌నైట్ స్కోర్ 3 వికెట్లు కోల్పోయి 69 పరుగులతో మూడో రోజు ఆంధ్ర జట్టు ఆటను ప్రారంభించింది. సుభంకాదం దాటికి 143పరుగులకే ఆలౌట్ అయ్యింది. బ్యాటర్లు వరుణ్ సాత్విక్ 50, లోహిత్ లక్ష్మీనారాయణ 28 పరుగులు చేశారు. రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన మహారాష్ట్ర జట్టు ఆటముగిసే సమయానికి 58 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 173 పరుగులు చేసింది. ప్రస్తుతానికి మహారాష్ట్ర 450 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది. సుసృత్ సావంత్ 56పరుగులు చేసి నాటౌట్‌గా నిలిశాడు. ఆంధ్ర బౌలర్లలో యువన్ 2, రాజేష్ వికెట్ తీశారు. ఒక్కరోజు ఆటమాత్రమే మిగిలి వుండటంతో మ్యాచ్ డ్రాగా ముగిసే అవకాశం కనిపిస్తోంది. బీసీసీఐ సెలెక్టర్ హర్విందర్‌సింగ్ సోధి, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఏజీఎం శివకుమార్, మహారాష్ట్ర సెలెక్షన్ కమిటీ చైర్మన్ మిలింద్‌గుంజాల్, క్రికెట్ సంఘం జిల్లా ఇన్‌చార్జి కార్యదర్శి భీమలింగారెడ్డి తదితరులు పోటీలను పర్యవేక్షించారు.

జయప్రదం చేయండి

అనంతపురం కల్చరల్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): వేమన ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న పద్యపోటీలను జయప్రదం చేయాలని ఆ ఫౌండేషన్ కార్యదర్శి అప్పిరెడ్డి హరినాథరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలోని వేమన ఫౌండేషన్ కార్యాలయంలో పద్యపోటీల పోస్టర్లను ఎస్కేయూ విశ్రాంత వీసీ కాడా రామకృష్ణారెడ్డి అధ్యక్షతన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అప్పిరెడ్డి హరినాథరెడ్డి మాట్లాడుతూ 100 పాఠశాలల్లో పద్యపోటీలు నిర్వహించడం జరుగుతోందన్నారు. ఆసక్తి ఉన్న పాఠశాలల యాజమాన్యాలు ఈ నెలాఖరులోపు 9963917187 నెంబర్‌ను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. జనవరి 9వ తేదీలోపు పాఠశాలస్థాయిలో పద్యపోటీలు నిర్వహించి, విజేతలకు మెడల్స్ ప్రశంసాపత్రాలు, వేమన పుస్తకాలను బహుమతులుగా అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వేమన ఫౌండేషన్ సభ్యులు మనోహర్‌రెడ్డి, లోకన్న, జలీల్ అహ్మద్, వన్నూర్ సాబ్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

అదృశ్యాలు.. ఆత్మహత్యలు

● ఉమ్మడి జిల్లాలో విషాద ఘటనలు

ఉమ్మడి జిల్లాలోని వేర్వేరు ప్రాంతాలలో నలుగురు అదృశ్యమయ్యారు. కొన్ని అదృశ్యాలు పోలీసు కేసులవరకూ వెళ్లాయి. మరికొన్ని మౌఖిక ఫిర్యాదులకు పరిమితమయ్యాయి. వేర్వేరు కారణాలతో ఐదుగురు ఆత్మహత్య చేసుకున్నారు. వీరిలో ఒక రైతు ఉన్నారు.

అప్పుల బాధతో యువ రైతు..


కార్తీక్

కళ్యాణదుర్గం రూరల్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం మండలం బాల వెంకటాపురం గ్రామానికి చెందిన యువ రైతు బ్యాళ్ల కార్తీక్ (23) అప్పుల బాధతో మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. కార్తీక్ తండ్రి వెంకటేశులు 14 సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. అప్పటి నుంచి తమ పది ఎకరాల పొలంలో కార్తీక్ వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. పొలంలో బొప్పాయి, టమోటా సాగు చేశాడు. పంటల సాగుకోసం బ్యాంకులో రూ.4 లక్షలు, వడ్డీ వ్యాపారుల వద్ద రూ.7 లక్షలు అప్పు చేశాడు. దిగుబడులు సరిగా రాక నష్టపోయాడు. అప్పులు తీర్చే మార్గంలేక ఇంట్లో తన లుంగీతో ఉరి వేసుకున్నాడు. తల్లి ఇందిరమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో లారీ డ్రైవర్..


మృతిచెందిన అశోక్‌కుమార్

పామిడి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చైతన్య కాలనీకి చెందిన పల్లపు అశోక్ కుమార్(37) అనారోగ్య సమస్యలతో మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు తెలిపారు. అశోక్ కుమార్ లారీ డ్రైవర్‌గా పనిచేసేవాడు. ఇటీవల షుగర్, ఆస్తమాతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది, ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

గుర్తుతెలియని వ్యక్తి..

గుంతకల్లు టౌన్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): గుంతకల్లు-గూళ్లపాళ్యం రైలు మార్గంలో వివేకానంద ఎంబీఏ కళాశాల సమీపంలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడని గుంతకల్లు జీఆర్పీ ఎస్‌ఐ మహేంద్ర తెలిపారు. మృతుడికి 30 సంవత్సరాలు వయసు ఉంటుందని, ఉరవకొండ నుంచి గుంతకల్లుకు తీసుకున్న బస్సు టిక్కెట్ ఉందని తెలిపారు. ఇతర ఆధారాలు లభించలేదని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇంకొక్కరు..

గుత్తి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): గుత్తి జీఆర్పీ పరిధిలోని తురకపల్లి - రామరాజుపల్లి రైల్వే స్టేషన్ల మధ్య గుర్తుతెలియని వ్యక్తి రైలు కింద పడి మృతి చెందారని రైల్వే ఎస్‌ఐ నాగప్ప తెలిపారు. మృతుడి వయసు 45 సంవత్సరాలు ఉంటుందని, అతని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని తెలిపారు. ప్రమాదవశాత్తు రైల్లో నుంచి జారీ పడ్డాడా, లేక ఆత్మహత్య చేసుకున్నాడా తెలియాల్సి ఉందని అన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని అన్నారు.

మనవరాలు కనిపించలేదని..

గుత్తి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వక్కలకుంట ప్రాంతంలో నివాసముంటున్న లక్ష్మీదేవి(65) అనే వృద్ధురాలు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఇంటి పైకప్పుకు ఉరివేసుకుందని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మనవరాలు కనిపించకుండా వెళ్లిపోవడంతో ఈ అఘాయిత్యానికి పాల్పడిందని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బాలికను తీసుకువెళ్లినా..

పుట్లూరు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): బాలికను తీసుకువెళ్లిన యువకుడిపై కేసు నమోదు కాకుండా వైసీపీ నాయకుడు ఒకరు చక్రం తిప్పారని సమాచారం. ఓ గ్రామానికి చెందిన బాలికను రెండు రోజుల క్రితం ఓ యువకుడు తీసుకువెళ్లాడు. దీంతో బాలిక తల్లిదండ్రులు తాడిపత్రి డీఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. రెండురోజుల అనంతరం పోలీసులు ఇద్దరినీ గుర్తించి పుట్లూరు పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. యువకుడి తరఫున వైసీపీ నాయకుడు వకాల్తా పుచ్చుకుని, కేసు లేకుండా చేసినట్లు తెలిసింది. ఈ విషయం తన దృష్టికి వచ్చిందని, కానీ బాలిక తల్లిదండ్రులు ఇంతవరకూ ఫిర్యాదు చేయలేదని డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని అన్నారు.

ఇంజనీరింగ్ విద్యార్థిని అదృశ్యం

అనంతపురం క్రైం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): నగరంలో ఓ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థిని పరీక్ష రాయడానికి వెళ్లి అదృశ్యమైంది. దీనిపై అనంతపురం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శ్రీ సత్యసాయి జిల్లా సోమందేపల్లికి చెందిన లిఖిత నగర శివారులోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. అక్కడే హాస్టల్‌లో ఉంటోంది. మరో కాలేజీ సెంటర్‌లో బుధవారం పరీక్ష రాయడానికి వచ్చి అదృశ్యమైంది. కళాశాలకు వెళ్లకపోవడంతో యాజమాన్యం తల్లిదండ్రులకు సమాచారం అందించింది. దీంతో లిఖిత తల్లి యశోద ఫిర్యాదు చేశారని రూరల్ పోలీసులు తెలిపారు.

ప్రేమ వివాదం..

బత్తలపల్లి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): కడప జిల్లా పులివెందులకు చెందిన శివప్రసాద్ (24) బత్తలపల్లిలో అదృశ్యమయ్యాడు. శివప్రసాద్ తండ్రి రామాంజనేయులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బత్తలపల్లిలోని తన అక్క, బావ వద్దకు శివప్రసాద్ వచ్చాడు. ఇదే ఊరిలో తమ బంధువుల అమ్మాయిని శివప్రసాద్ ప్రేమించాడు. దీంతో యువతి తరఫువారు గొడవపడ్డారు. అప్పటి నుంచి శివప్రసాద్ అదృశ్యమయ్యాడు. దీంతో యువకుని తండ్రి రామజినేయులు మంగళవారం తమకు ఫిర్యదు చేశారని ఎస్‌ఐ సోమశేఖర్ తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా.. వ్యక్తి మృతి

గుంతకల్లు టౌన్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పాతకొత్తచెరువు గ్రామ సమీపంలో మట్టి తరలిస్తున్న ట్రాక్టర్ మంగళవారం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో పాతకొత్తచెరువు గ్రామానికి చెందిన బి. శేషానందరెడ్డి(28) మృతి చెందారు. సొంత ట్రాక్టర్‌లో గ్రామ శివారులో మట్టిని తరలించేందుకు శేషానందరెడ్డి వెళ్లారు. మట్టిని లోడ్ చేసుకుని వస్తుండగా అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో తీవ్రంగా గాయపడిన ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య చంద్రకళ, మూడు సంవత్సరాల ఒక కుమారుడు ఉన్నాడు. కసాపురం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గోడకూలి.. కూలీ..

కదిరి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజీవ్‌గాంధీ నగర్‌లో గోడ కూలి గంగులప్ప(48) అనే కూలీ మృతిచెందాడు. చలమకుంట్లపల్లికి చెందిన గంగులప్ప పాత ఇల్లు కూల్చే పనికి వచ్చాడు. ఇల్లు కూల్చేసమయంలో గోడ గంగులప్ప మీద పడింది. శకలాల కింద ఊపిరాడక మృతిచెందాడు.

ప్చ..!



కందిని దెబ్బకొట్టిన వరుస తుఫాన్లు

● పైర్లు పెరిగినా.. ప్రయోజనం శూన్యం
● రాలిపోయిన పూత ● దిగుబడిపై తీవ్ర ప్రభావం


నంబులపూలకుంట మండలంలో ఏపుగా పెరిగిన కంది పైరు

కదిరి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): వరుస తుఫాన్లు కంది పంటను తీవ్రంగా దెబ్బకొట్టాయి. కందిపంట సాగుచేసిన రైతులు దిగుబడిపై దిగాలుగా ఉన్నారు. ఈసారి కూడా కంది పంట పోయిందని మదనపడుతున్నారు. ప్రధాన పంట వేరుశనగపై ఆధార పడకుండా కందిని ఈసారి ఎక్కువ మంది సాగుచేశారు. నెల క్రితం వరకు పంట ఆశాజనకంగా ఉండేది. నవంబరు, డిసెంబరు నెలల్లో వరుస తుఫాన్లు రావడంతో కంది పంట దిగుబడిపై రైతన్నలు దిగులు పెట్టుకున్నారు. కంది సాగుకు ఖర్చు కూడా తక్కువ కావడంతోపాటు గిట్టుబాటు ధర కూడా దక్కుతుండడంతో రైతులు కంది సాగుపై ఆసక్తి చూపుతున్నట్లు తెలిసింది.

కంది పోయింది..

కంది పంట సాగుకు జిల్లాలో రైతులు మక్కువ చూపుతున్నారు. ప్రధాన పంట వేరుశనగ తరువాత కందిపంటనే ఎక్కువమంది సాగు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా కంది పంటను 49,061 మంది రైతులు 92,750 ఎకరాల్లో సాగుచేసినట్లు వ్యవసాయాధికారుల లెక్కలు చెబుతున్నాయి. రొద్దం మండలంలో అత్యధికంగా 18,367 ఎకరాల్లో సాగుచేశారు. కదిరి వ్యవసాయ డివిజన్‌లో దాదాపు 10 వేల ఎకరాల్లో పంట పెట్టారు. నవంబరు నుంచి కంది పూత రావడం మొదలైంది. ఇదే సమయంలో నెలపాటు తుఫాన్ల ప్రభావంతో పూత రాలిపోయింది. ముఖ్యంగా కదిరి డివిజన్‌లో కందిపంటపై తుఫాన్ల ప్రభావం ఎక్కువగా ఉన్నట్లు రైతులు చెబుతున్నారు. రెండు, మూడు రోజులు ఎడతెరిపి లేకుండా వర్షం పడడంతో పూత రాలిపోయినట్లు రైతులు చెబుతున్నారు. ఇది దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుందని రైతులు అంటున్నారు. కంది పంట ఏపుగా పెరిగిందే తప్ప.. దిగుబడి అంతంత మాత్రంగానే ఉందని చెబుతున్నారు. గింజ పట్టిన కంది తక్కువగా ఉన్నట్లు చెబుతున్నారు.

దిగుబడిపై తీవ్ర ప్రభావం

కంది పంటకు అనుకూల వాతావరణం అంటే ఎటువంటి వర్షాలు లేకుండా ఉండడమే. ముఖ్యంగా పూత సమయంలో వర్షం పడకూడదు. వర్షానికి పూత రాలిపోయే ప్రమాదం ఉంది. సాధారణంగా ఎకరాకు కనీసం 8 క్వింటాళ్ల వరకు దిగుబడి ఉంటుంది. ప్రస్తుతం వరుస తుఫాన్లతో రెండు నుంచి మూడు క్వింటాళ్ల వరకు మాత్రం దిగుబడి రావచ్చని రైతులు వాపోతున్నారు. పెట్టుబడి కూడా రాదని చెబుతున్నారు. ఇలా అయితే మళ్లీ అప్పులపాలేనని ఆవేదన చెందుతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

కంది పంట సాగుచేసి తీవ్రంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. పంటల బీమా పథకంలో కంది ఉన్నప్పటికీ కొన్ని మండలాల్లో వరుసగా వర్తిస్తోందని రైతులు చెబుతున్నారు. కంది పంట సాగుచేసి నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేస్తున్నారు. కరువు ప్రాంతంగా ప్రకటించి రైతులు వచ్చే ఖరీఫ్ పంటలు సాగుచేయడానికి సబ్సిడీలు అందించాలని కోరతున్నారు.

ఒక్క కాయ కూడా లేదు



నాలుగెకరాల్లో కంది సాగుచేశా. పూత దశలో మేఘాలు కమ్ముకోవడంతో పూత పూర్తిగా రాలిపోయింది. ఎండ కాసిన రెండురోజులకే మొగ్గలు రావడం, తరువాత మబ్బులు రాగానే పూత రాలిపోతోంది. వాతావరణ పరిస్థితులవల కారణంగా పూత, కాయాలేదు. సంక్రాంతికి కోత కోయాల్సి ఉండగా, ఒక్క కాయ కూడాలేదు. రూ.50వేలు నష్టపోయా

- మదారాబాషా, ధనియాన్‌చెరువు, ఎన్పీకుంట

40శాతం పూతపోయినా దిగుబడి తగ్గదు

కందిలో పూత రాలడం సహజం. వరుస తుఫాన్ల ప్రభావంతో కంది పూత రాలిపోయింది. 40 శాతం పూత రాలిపోయినా దిగుబడికి ఇబ్బంది ఉండదు. పూత రాలకుండా గతంలో రైతులకు మందులు సూచించాం. కాయగా ఏర్పడడానికి కొంతమంది రైతులు మందులు కొట్టారు. ప్రస్తుత దశలో ఎటువంటి మందులు అవసరం లేదు. దిగుబడిపై రైతులు దిగులు పడాల్సిన అవసరం లేదు.

- సత్యనారాయణ, వ్యవసాయశాఖ ఏడీ

ఆర్టీసీ ఉద్యోగుల.. ఆనందం..!

● రాత్రి భత్యం అమలుకు ప్రభుత్వం నిర్ణయం
● నైట్ సర్వీసులకు వెళ్లేవారికి ఉపయోగకరం


ధర్మవరం ఆర్టీసీ బస్టాండ్

ధర్మవరం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో రాత్రి వేళల్లో విధులు నిర్వహించే ఉద్యోగులకు భత్యం మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం పట్ల హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం రాత్రి భత్యాన్ని ఆపేసి, అన్యాయం చేసింది. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన ఆరు నెలల్లోనే రాత్రి భత్యాన్ని ఇచ్చేందుకు ముందుకు రావడం పట్ల ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత వైసీపీ హయాంలో మొదట్లో ఆరునెలలపాటు రాత్రి భత్యం ఇచ్చారు. ఆ తరువాత డ్రైవర్లు, కండక్టర్లు ప్రభుత్వ ఉద్యోగులని జీఓ తీసుకొచ్చారు. దీంతో రాత్రి భత్యం రద్దు చేశారు. దీనిపై సంఘాలు పలురూపాల్లో ఆందోళనలు చేపట్టాయి. యూనియన్ల ఆధ్వర్యంలో గేటుమీటింగులు, ధర్నాలు, ప్రజాప్రతినిధులకు వినతులు అందజేశారు. అయినా.. ప్రయోజనం లేదు. వైసీపీ ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాత్రి భత్యం ఇవ్వాలని సంఘాల నుంచి వినతులు వెల్లువెత్తాయి. ఈ క్రమంలో రాత్రి భత్యం మంజూరు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో ఆర్టీసీ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అదనపు ఆదాయం

జిల్లాలో ధర్మవరం, పుట్టపర్తి, హిందూపురం, పెనుకొండ, కదిరి, మడకశిర పట్టణాల్లో మొత్తం 6 ఆర్టీసీ డిపోలున్నాయి. వీటి పరిధిలో దాదాపు 2వేల మంది కండక్టర్లు, డ్రైవర్లు విధులు నిర్వహిస్తున్నారు. ఈ డిపోల్లో రాత్రివేళల్లో విధులకు వెళ్లేవారు దాదాపు 150 మంది ఉన్నారు. వీరికి నిబంధనల ప్రకారం నెలవారీ జీతంతోపాటు రాత్రి విధులకు వెళ్లిన రోజున అదనంగా భత్యం (అలవెన్స్) దూరాన్ని రూ.150 నుంచి రూ.400 వరకు చెల్లిస్తారు. ఒక్కో డిపోలో 30 నుంచి 50 బస్సు సర్వీసులు రాత్రి వేళల్లో సుదూర ప్రాంతాలైన హైదరాబాద్, విజయవాడ, చెన్నై, బెంగళూరు, శ్రీశైలం, నెల్లూరు వంటి నగరాలతోపాటు జిల్లాలో ఆయా గ్రామాలకు వెళ్తుంటాయి. ఆ సర్వీసులకు వెళ్లే ఉద్యోగులకు నెలకు రూ.4వేల నుంచి రూ.6వేలదాకా రాత్రి భత్యం అందనుంది.

కష్టాలను గుర్తించిన ప్రభుత్వం



ఆర్టీసీలో గతంలో రాత్రి భత్యం ఇచ్చేవారు. గత వైసీపీ ప్రభుత్వం దానిని రద్దు చేసింది. దీంతో నైట్ సర్వీసు విధులకు వెళ్లే సిబ్బంది నెలకు దాదాపు రూ.4వేలు రాత్రి భత్యం కోల్పోయేవారు. కూటమి ప్రభుత్వం రాత్రి భత్యం మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడం అభినందనీయం.

- తిరుమలేశు, ఈయూ డిపో అధ్యక్షుడు, ధర్మవరం

పోరాట ఫలితమే



ఆర్టీసీలో రాత్రిపూట విధులు నిర్వహించే ఉద్యోగులకు అలవెన్స్ ఇవ్వాలని కొంతకాలంగా పోరాటాలు చేస్తున్నాం. వాటి ఫలితంగా కూటమి ప్రభుత్వం స్పందించి రాత్రి భత్యం మంజూరు చేయడం హర్షణీయం.

- ప్రభాకర్, ఎన్ఎంయూ డిపో అధ్యక్షుడు, ధర్మవరం

వాతావరణ అనుకూల వ్యవసాయం అమలు చేయండి

● అధికారులకు ఇన్‌చార్జ్ కలెక్టర్ ఆదేశం

అనంతపురం టౌన్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వాతావరణ అనుకూల వ్యవసాయ కార్యక్రమా న్ని పక్కాగా అమలు చేయాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి మంగళవారం ఈ- వ్యవసాయంపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. రైతులు నష్టపోకుండా వాతా వరణానికి అనుగుణంగా వ్యవసాయం, పంటలు సాగు చేస్తే బాగుంటుందని ఆర్డీటీ ఎకాలజీ సంస్థ సూచించిందన్నారు. ఇందులో జిల్లాలో పది గ్రామాలను ఎంపిక చేసి అక్కడ వాతావరణ అనుకూల వ్యవసాయ కార్యక్రమం అమలుకు ప్రతిపాదించామన్నారు. ఆయా గ్రామాల్లో అందరు అధికారులు సమన్వయంతో ఈ - వ్యవసాయాన్ని పక్కాగా అమలు చేయాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ సూచించారు. ఇది భవిష్యత్తులో ఇతర గ్రామాల్లో రైతులు పాటించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయాధికారి జేడీ ఉమామహేశ్వర మ్మ, ఉద్యానశాఖ డీడీ నరసింహారావు, ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి, పశుసంవర్ధకశాఖ ఏడీ శ్రీలక్ష్మి, నాబార్డు డీడీఎం అనూరాధ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ కలెక్టరు శివనారాయణ్‌శర్మ

ఆకలి తీరుస్తున్న అన్నదాత..!

● ఆరేళ్లుగా బాటసారులకు నిత్యాన్నదానం



తనకల్లు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఆరేళ్లుగా నిత్యాన్నదాన కార్యక్రమాన్ని కొనసాగిస్తున్న ఓ అన్నదాత అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాడు. చిన్నసాయం చేసినా గొప్పలు చెప్పుకుంటున్న నేటి సమాజంలో.. ఎక్కడా తనపేరుకానీ, ఫొటోకానీ లేకుండా, ఎవరు అన్నదానం చేస్తున్నారో తెలియకుండా నిత్యాన్నదాన కార్యక్రమాన్ని కొనసాగిస్తూ.. బాటసారుల ఆకలి తీరుస్తున్నాడు. తనకల్లు మండలంలోని మరాలపల్లి వద్ద 2018 సంవత్సరంలో నిత్యాన్నదాన కార్యక్రమాన్ని ఆ గ్రామానికి చెందిన బళ్లాపురం ధనుంజయ ప్రారంభించారు. గ్రామం వద్ద కొక్కంటిక్రాస్, అమడగూరు రహదారిలో రోడ్డు పక్కన మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల వరకు ఎవరు వచ్చినా అన్నం లేదనకుండా వడ్డించేవారు. అక్కడే షెల్టర్ నిర్మాణం చేపడతామని ముందుకు రావడంతో భూ యజమానులు అడ్డుతగిలారు. దీంతో గ్రామం అటువైపున తమ సొంత భూమిలో శాశ్వత షెడ్ నిర్మాణం చేట్టారు. అక్కడే బాటసారులకు నిత్యం అన్నదానం నిర్వహిస్తున్నారు. ప్రతిరోజూ వందమందికి తక్కువ కాకుండా బాటసారులు, కియా పరిశ్రమకు వెళ్లే వాహనచోదకులు, అక్కడి నుంచి చెన్నై వెళ్ల వాహనచోదకులు, పశువుల కాపర్లు, బాటసారులు, ఉద్యోగులు, ఎవరైనా సరే ఆ సయంలో వెళ్లి భోజనం చేయవచ్చు. అన్నంతోపాటు రాగిముద్ద నిత్యం అందుబాటులో ఉంటాయి. బాటసారులకు భోజనం వండి వడ్డించడానికి దాతలు ఎవరి వద్ద సాయం అడగకుండా కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా కొనసాగిస్తున్నారు. బాటసారులకు అన్నం వండి వడ్డించడానికి ముగ్గురు వ్యక్తులను నియమించుకున్నారు. ఒక్కొక్కరికి రూ.7వేల వేతనం చెల్లిస్తూ గత ఆరేళ్లుగా అన్నదాన కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. ఎప్పుడూ తాను చేస్తున్న అన్నదాన కార్యక్రమాన్ని గురించి ప్రచారం చేసుకోలేదు. వంటకు కావలసిన అన్నిరకాల కూరగాయలు, బియ్యం, సామగ్రిని తామే సమకూర్చుతున్నారు. వర్షం వచ్చినా, పండగరోజైనా అన్నదానం కొనసాగుతూనే ఉంటుంది. ఆరేళ్లుగా నిత్యాన్నదానం చేస్తూ ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్న ధనుంజయను బాటసారులు కొనియాడుతున్నారు.


ధనుంజయ దంపతులు


బాటసారులకు భోజనం

ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యం

● మంత్రి సత్యకుమార్ యాదవ్
● ధర్మవరంలో డయాలసిస్ కేంద్రం ప్రారంభం


డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సత్యకుమార్

ధర్మవరం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్య పరిరక్షణే ప్రభుత్వ లక్ష్యమని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. స్థానిక పోతుకుంట రోడ్డులోని మాతాశిశు సంక్షేమ ఆస్పత్రిలో డయాలసిస్ సెంటర్‌ను మంత్రి మంగళవారం ప్రారంభించారు. డయాలసిస్‌కు సంబంధించిన గదులు, పరికరాలను అక్కడున్న వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే రాష్ట్రంలో 50కిపైగా డయాలసిస్ సెంటర్లున్నాయన్నారు. గతంలో డయాలసిస్ కోసం చాలాదూరం వెళ్లాల్సి వచ్చేదన్నారు. తద్వారా రోగులపై అదనపు భారం పడేదన్నారు. దూరప్రాంతాలకు వెళ్లడానికి ఇబ్బంది పడేవారన్నారు. ప్రస్తుతం డయాలసిస్ కేంద్రాలను పెంచడం ద్వారా బాధితుల కష్టాలు తీరుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఏపీ సీడ్స్ కార్పొరేషన్ డైరెక్టర్ కమతం కాటమయ్య, బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్, టీడీపీ పట్టణాధ్యక్షుడు పరిశే సుధాకర్, డయాలసిస్ స్టేట్ మోడల్ ఆఫీసర్ నిర్మల గౌరి, జిల్లా వైద్యాధికారి ఫైరోజా బేగం, డీసీహెచ్ఎస్ తిప్పేంద్రనాయక్ పాల్గొన్నారు.

ఉద్యోగాలకు 118 మంది ఎంపిక


ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో ఎస్కేయూ వీసీ, రిజిస్ట్రార్

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : వివిధ సంస్థల్లో పనిచేసేందుకు 118మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఎస్కేయూ, ఏపీఎస్ఎస్‌డీసీ, సీడ్యాక్, ఎంప్లాయిమెంట్ డిపార్ట్‌మెంట్ సంయుక్తాధ్వర్యంలో మంగళవారం మెగా జాబ్‌మేళాను నిర్వహించారు. ఎస్కేయూ పాలిమర్ సైన్స్ సెమినార్ హాల్లో నిర్వహించిన జాబ్‌మేళాను ముఖ్య అతిథులుగా హాజరైన వీసీ ప్రొఫెసర్ అనిత, రెక్టార్ ప్రొఫెసర్ వెంకటనాయుడు, రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ అనిత మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆకాంక్షను నెరవేర్చేలా జాబ్‌మేళాలను నిర్వహించి విద్యార్థులకు ఉద్యోగాలు కల్పిస్తున్నామన్నారు. చదువుతో పాటు ఉద్యోగ మెలకులపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. రెవ్యూటెక్‌కు 40 మంది, క్రెడిట్ యాక్సెస్ గ్రామీణ్‌కు 30, ఐసన్ టెక్నాలజీకి 35, టీసీఎస్‌కు 13మంది చొప్పున మొత్తం 118మంది విద్యార్థులకు ఎంపికవడం హర్షణీయమని తెలిపారు. అనంతరం ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

సంక్షిప్తం

సభ్యత్వాల నమోదుకు విరాళాలు


విరాళం అందజేస్తున్న సుధాకర్ యాదవ్


విరాళం అందజేస్తున్న సింగవరం రవి

అనంతపురం అర్బన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పేదలతో పార్టీ సభ్యత్వాలు చేయించేందుకు పలువురు టీడీపీ నాయకులు మంగళవారం రూ.2 లక్షలు విరాళాలు అందించారు. తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ యాదవ్ రూ.50వేలు, టీడీపీ సీనియర్ నాయకుడు సింగవరం రవి రూ.50వేలు, 45వ డివిజన్ నాయకులు దినేష్ చౌదరి, వెంకటరమణ రూ.50వేలు, 13వ డివిజన్ నాయకుడు కాశీ విశ్వనాథ్ రూ.50వేలను ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్‌కు టీడీపీ అర్బన్ కార్యాలయంలో అందజేశారు. వారిని ఎమ్మెల్యే అభినందించారు. అనంతపురం అర్బన్‌లో లక్ష్యం మేరకు పార్టీ సభ్యత్వాలు పూర్తి చేసేందుకు అందరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బుగ్గయ్య చౌదరి, రాయల్ మురళి, పోతుల లక్ష్మీనరసింహులు, కడియాల కొండన్న, పరమేశ్వరన్, లక్ష్మీనరసింహ, సంగా తేజస్విని, నెట్టెం బాలకృష్ణ, వెంకటప్ప, అమర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

31లోగా బీమా ప్రీమియం చెల్లించండి

గార్లదిన్నె, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): రబీ పంటల బీమా ప్రీమియంను ఈనెల 31వ తేదీ లోగా రైతులు చెల్లించవచ్చుని మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్ తెలిపారు. కల్లూరు రైతు సేవా కేంద్రంలో మంగళవారం అధికారుల సమావేశంలో అయన మట్లాడారు. రబీలో సాగు చేసిన వరి, వేరుశనగ, మొక్కజొన్న, పొద్దుతిరుగుడు రైతులు పంటల బీమా చెల్లించడానికి ఈనెల 31 వరకు సమయం ఉందని తెలిపారు.

ఆలయాభివృద్ధికి సహకరించండి


టీటీడీ చైర్మన్‌కు వినతి పత్రం ఇస్తున్న సర్పంచ్

అనంతపురం రూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నంపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయం అభివృద్ధికి సహకరించాలని గ్రామ సర్పంచు శివశంకర్ కోరారు. ఈ మేరకు మంగళవారం తిరుమలలో టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడిని కలసి వినతి పత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు త్రిలోకనాథ్, వెంకటేశులు, సురేంద్ర, నారాయణస్వామియాదవ్, ఎర్రిస్వామి, మహేష్‌యాదవ్, హరిజన మల్లన్న, నాగరాజు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలకు పేర్లు నమోదు చేసుకోండి

రాప్తాడు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రసన్నాయపల్లి పంచాయతీ పరిధిలోని చిన్మయ్‌నగర్‌లో సంక్రాంతి రోజు (జనవరి 14)న ముగ్గుల పోటీలకు మహిళలు పేర్లు నమోదు చేసుకోవాలని గౌరీ ప్రసన్నేశ్వరస్వామి ఆలయ కమిటీ సభ్యులు ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 3 గంటలకు ఆలయం వద్ద నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి, రెండవ, మూడవ విజేతలకు ప్రత్యేక బహుమతులు అందజేస్తామన్నారు.

భూముల రక్షణకే రెవెన్యూ సదస్సులు

నార్పల, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): భూ సమస్యలపై ప్రజలు, బాధితులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగకుండా ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని తహసీల్దారు అరుణకుమారి పేర్కొన్నారు. స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయం ఆవరణంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఎంపీడీఓ గంగావతి, గూగూడు ఆలయ ఈఓ శోభ, డీటీ శ్రీనివాసమూర్తి, వీఆర్వోలు శివరాం, రామాంజినేయులు, నిరంజన్‌రావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● రాప్తాడు: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలు పరిష్కారమవుతాయని తహసీల్దార్ విజయకుమారి తెలిపారు. మంగళవారం మండలంలోని గొల్లపల్లిలో రెవెన్యూ స దస్సు నిర్వహించారు. హౌసింగ్ ఏఈ లావణ్య, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

ముగిసిన సదస్సులు

చెన్నేకొత్తపల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ అధికారులు నిర్వహిస్తున్న గ్రామ సదస్సులు మంగళవారంతో ముగిశాయి. చెన్నేకొత్తపల్లిలో నిర్వహించిన ముగింపు సదస్సులో రైతుల నుంచి 23 అర్జీలు వచ్చాయి. మండలంలో ఈనెల 6వ తేదీ నుంచి ప్రారంభమైన ఈ సదస్సులు తొమ్మిది రెవెన్యూ గ్రామాలలో జరిగాయి. భూ సమస్యలకు సంబంధించి మొత్తం 135 అర్జీ లు వచ్చినట్లు తహసీల్దార్ సురేశ్‌కుమార్ తెలిపారు. ప్రదానంగా పొలాలకు రస్తాలు, సాగు చేసుకుంటున్న భూముల పట్టాల కోసం, జాయింట్ ఎల్‌పీఎంలు, సబ్‌డివిజన్ల కోసం అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు.

తీరు మారలేదు..!

● విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖలో ఓ అధికారి వ్యవహారంపై విమర్శలు


విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ కార్యాలయం

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖలో ఓ అధికారి తీరు మారలేదు, కమీషన్లలో తగ్గేదేలా అన్న తరహాలో వ్యవహరిస్తున్నారనే ఆ శాఖ వర్గాల నుంచే అభిప్రాయాలు వెలువడుతున్నాయి. పత్రికల్లో వరుస కథనాలు వస్తున్నా, ఆశాఖ రాష్ట్రస్థాయిలోని కొందరు అధికారులు చివాట్లు పెట్టినా, కలెక్టర్ అవినీతిపై ఆరా తీస్తున్నా ఆయనలో ఇసుమంతైనా భయం కనిపించకపోవడం అందర్నీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. తాజాగా.. ఎన్నికల సమయంలో వీల్‌చైర్ల పంపిణీలో ఆయన కమీషన్లకు కక్కుర్తి పడిన విషయం విదితమే. వీల్‌చైర్ల పంపిణీలో టెండర్లు దక్కించుకున్న ఓ ముగ్గురు వ్యక్తులకు మిగిలిన మొత్తం ఇవ్వాల్సి ఉంది. అయితే మూడ్రోజుల క్రితం ఆ అధికారి వారిని కార్యాలయానికి పిలిపించి ఆ మిగులు చెక్కులను పంపిణీ చేసినట్లు ఆ శాఖ వర్గాల ద్వారా అందిన సమాచారం. ఆ సమయంలోనూ తన వాటా తనకివ్వాలని వారిపై ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం. దీంతో వారు ఆ అధికారి వాటా కింద దాదాపు రూ. 3 లక్షలు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇలా ఆ అధికారి మెడకు అవినీతి ఉచ్చు బిగుస్తున్నప్పటికీ... మామూళ్ల విషయంలో ఏ మాత్రం తగ్గేదేలా అన్న రీతిలో కమీషన్లకు పాల్పడుతుండటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇందుకు ఆ శాఖలోని రాష్ట్రస్థాయిలో ఉన్న కొందరు అధికారులు సహకరిస్తున్నారనే విమర్శలు లేకపోలేదు.

తప్పించుకునే ప్రయత్నం

విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖలోని ఆ అధికారి తీరుపై ఆంధ్రజ్యోతిలో వరుస కథనాలపై ఆ శాఖ రాష్ట్రస్థాయి అధికారులతో పాటు జిల్లా కలెక్టరేట్ వర్గాలు సైతం సీరియస్ అయినట్లు తెలుస్తోంది. గత వారంలోనూ కలెక్టరేట్ అధికారులు ఫోన్ ద్వారా ఆ అధికారిపై వస్తున్న ఆరోపణలపై ఆరా తీయగా, తాను సెలవులో ఉన్నానని బుకాయించి గ్రీవెన్స్ కార్యక్రమానికి కూడా డుమ్మా కొట్టినట్లు సమాచారం. అయితే ఆ రోజంతా కార్యాలయంలోనే ఉండి తన ఆర్థికపరమైన అంశాలపై పలువురితో లావాదేవీలు జరిపినట్లు ఆ శాఖలోని కొందరు ఉద్యోగుల ద్వారా అందిన సమాచారం. తాజాగా... మరోమారు కలెక్టరేట్ వర్గాలు అవినీతి కథనాలపై ఆరా తీయగా, పొంత నలేని సమాదానాలు చెప్పడంతోపాటు తనకు ఆరోగ్యం బాగోలేదని తప్పించుకునే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది.

శివారు కాలనీలపై ఐదేళ్ల నిర్లక్ష్యం

● ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్


మరువకొమ్మ కాలనీలో డ్రైనేజీ సమస్యపై ఆరాతీస్తున్న ఎమ్మెల్యే

అనంతపురం అర్బన్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల వైసీపీ పాలనలో నగర శివారు కాలనీలపై తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించారని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ పేర్కొన్నారు. 'మీ ఇంటికి-మీ ఎమ్మెల్యే' కార్యక్రమంలో భాగంగా మంగళవారం 22వ డివిజన్ పరిధిలోని మరువకొమ్మ కాలనీలో టీడీపీ నాయకులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. ఇంటింటికి వెళ్లి సమస్యలపై ఆరా తీశారు. డ్రైనేజీ, తాగునీరు, ఇళ్ల పట్టాల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి ప్రజలు తీసుకొచ్చారు. కాలనీలో డ్రైనేజీలు ఇంత అధ్వానంగా ఉండేందుకు కారణమేంటని నగర పాలక సంస్థ అధికారులను ఎమ్మెల్యే నిలదీశారు. వెంటనే డ్రైనేజీ కాలువలు శుభ్రం చేయించాలని ఆదేశించారు. కాలనీలో ఎకరా స్థలంలో పార్కు, స్కూల్ ఏర్పాటు చేయాలని, 30 ఏళ్లగా కాలనీలో ఇళ్ల పట్టాల సమస్య ఉందని స్థానికులు తెలిపారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే ఇళ్ల పట్టాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాలనీలో పార్కు, స్కూల్ ఏర్పాటుపై మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. నగరంలోని సమస్యల ను ప్రాధాన్యతల వారీగా పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే ఆదేశాలతో కాలనీలోని డ్రైనేజీ కాలువలను కార్మికులు శుభ్రం చేశారు. కార్యక్రమంలో నాయకులు జైబున్నీ, మంజుల, ఈశ్వరయ్య, రాయల్ మురళీ, గుర్రం నాగభూషణం, పరమేశ్వరన్, సంగా తేజస్విని, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

హోటల్స్ అండ్ రెస్టారెంట్లపై విజిలెన్స్ దాడులు


అపరిశుభ్రతపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డీఎస్పీ

అనంతపురం న్యూటౌన్, డిసెంబరు24 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని హోటల్స్ అండ్ రెస్టారెంట్లపై విజిలెన్స్ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. అందులో భాగంగా విజిలెన్స్ డీఎస్పీ నాగభూషణం ఆధ్వర్యంలో పాకశాల హోటల్, లక్కీ-9, తాడిపత్రి బిర్యానీ ఫ్యామిలీ రెస్టారెంట్, బెంగళూరు రోడ్డులో తనిఖీలు చేపట్టారు. వాటిలో ఫుడ్ శాంపుల్స్ సేకరించి పరిక్షల నిమిత్తం పంపామన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని హెచ్చరికలు జారీ చేసి, నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. తనిఖీల్లో సీఐ జమాల్‌బాషా, ఏఓ వాసుప్రకాష్, ఫుడ్ సేఫ్టీ అధికారి తస్లీమా తదితరులు పాల్గొన్నారు.

అలరించిన గాన స్వరాంజలి


మహమ్మద్ రఫి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): సినీ గాయకుడు మహమ్మద్ రఫి జయంతిని పురస్కరించుకుని సాదియా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన గాన స్వరాంజలి వీక్షకులను ఎంతగానో అలరించింది. స్థానిక లలిత కళా పరిషత్ ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని పరిషత్ ప్రధాన కార్యదర్శి పద్మజ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. తొలుత కళాకారులతో కలిసి మహమ్మద్ రఫి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన గాన స్వరాంజలిలో స్థానిక కళాకారులతో పాటు కర్ణాటకకు చెందిన నిర్మలనీలి, మౌలా హుస్సేన్, మధ్యప్రదేశ్‌కు చెందిన రియా, ఫారూక్, రామాంజి మహమ్మద్ రఫి పాటలు ఆలపించారు. ఎస్కేయూ విశ్రాంత రిజిస్ట్రార్ ఆచార్య సుధాకర్‌బాబు, పైలా నరసింహులు, సాలార్‌బాషా, సాదియా సంస్థల అధినేతలు డిస్కోబాబు, షబానా, ర్యాంబో అస్లాం బాషా, ఐఎంఎం రాష్ట్ర అధ్యక్షుడు మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

స.హ. చట్టంపై జవాబుదారీగా ఉండాలి : డీఆర్ఓ

అనంతపురం టౌన్, డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): సమాచారహక్కుచట్టం విషయంలో అధికారులు జవాబుదారీతనంతో వ్యవహరించాలని డీఆర్ఓ మలోల ఆదేశించారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో సమాచారహక్కు చట్టంపై మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్ఓ మాట్లాడుతూ సమాచారహక్కు చట్టం రాజ్యాంగబద్ధంగా ఏర్పడిందన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలకు ప్రతివిషయం తెలియజేయడం ప్రభుత్వాధికారులుగా మనబాధ్యత అన్నారు. సమాచారచట్టంకింద ఏ పౌరుడు ఏవిషయం అడిగినా పక్కాగా సమాచారం అందించాలని ఆదేశించారు. మన కార్యాలయానికి సంబంధించినది కాకపోయినా ఇతర కార్యాలయానికి పంపి సమాచారాన్ని ఇవ్వాలని సూచించారు. ఖచ్చితమైన సమాచారం అందిస్తే అప్పీళ్లకు వెళ్లే అవకాశం ఉండదన్నారు. సమావేశంలో డిప్యూటీ కలెక్టర్లు తిప్పేనాయక్, ఆనంద్, డీఈఓ ప్రసాదుబాబు, జడ్పీసీఈఓ వెంకటసుబ్బయ్య, డీటీసీ వీర్రాజుతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఐదేళ్ల పాలనలో రోడ్ల దుస్థితి కనిపించ లేదా?

● వైసీపీపై టీడీపీ నాయకుల ఆగ్రహం

చెన్నేకొత్తపల్లి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎక్కడ చూసినా రోడ్లపై గుంతలు కనిపించేవని, వాటికి పట్టెడు మట్టి వేసిన పాపాన పోలేదని టీడీపీ మండల కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ అంకే అమరేంద్ర మండిపడ్డారు. ఇప్పుడు ఆ పార్టీ నాయకులు రోడ్లు అధ్వానంగా ఉన్నాయని తమ అనుకూల పత్రికలో ప్రకటనలు గుప్పించడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. టీడీపీ స్థానిక కార్యాలయంలో మంగళవారం పలువురు పార్టీ నాయకులతో కలిసి వారు విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆర్నెల్లలోనే రాష్ట్రంలో చాలా వరకు రోడ్లకు మహర్దశ కల్పించిందన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే పరిటాల సునీత కొన్ని తారు రోడ్లతో పాటు రూ.20.40కోట్లతో సీసీరోడ్ల నిర్మాణం చేయించారన్నారు. దీనిపై ప్రజల మన్ననలను అందు కుంటుండటంతో వైసీపీ నాయకులు ఓర్వలేకపోతున్నారని ఆరోపించారు. మండల ప్రధానకార్యదర్శి ముత్యాలప్ప, మాజీ ఎంపీపీ అమరేంద్ర రెడ్డి, గేటు నాగరాజు, శివ, రాజు, ఓబిరెడ్డి, బన్యాల సూర్యనారాయణ, ముత్యాలప్ప, ముకుంద, ఉత్తర కుమారరెడ్డి, బండి ఆంజనేయులు, ఆది పాల్గొన్నారు.

రేపు ఆధార్ కేంద్రం ప్రారంభం

నార్పల, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మం డల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో గురువారం ఆధార్‌కేంద్రం ఏర్పాటు చేస్తున్న ట్లు ఎంపీడీఓ గంగావతి తెలిపారు. మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సారయ్య సస్పెన్షన్

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా విధులు నిర్వహిస్తున్న సారయ్య సస్పెండ్ అయ్యారు. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వ కార్య దర్శి కన్నబాబు ఉత్తర్వులను జారీ చేశారు. గతంలో నెల్లూరు జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా విధులు నిర్వహించిన సారయ్య, ఎస్సీ కార్పొరేషన్‌లో అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న భారతి, రఫి అహ్మద్‌లకు నిబంధనలకు విరుద్ధంగా టైంస్కేల్ టైపిస్టులుగా ఉద్యోగోన్నతులు కల్పించారు. శాఖకు సంబంధించిన ఖాతాలు, నగదు పుస్తకాలు, బ్యాంకు స్టేట్‌మెంట్లకు సంబంధించిన రికార్డుల మెయింటెనెన్స్, నిధుల దుర్వినియోగం చేయడంపై ఆ శాఖ రాష్ట్ర అధికారులు సీరియస్ అయ్యారు. దీనిపై దాదాపు రెండేళ్లకుపైగా విచారణ సాగుతూ వచ్చింది. మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ సెక్రటరీ కన్నబాబు ఈడీ సారయ్యను సస్పెండ్ చేస్తూ అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశారు.

దీర్ఘకాలిక సెలవులో ఏసీపీ

అనంతపురం క్రైం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): నగరపాలిక టౌన్ ప్లానింగ్ విభాగం ఏసీపీ శ్రీనివాసులు నెలరోజుల పాటు దీర్ఘకాలిక సెలవులోకి వెళ్లారు. ఆయనపై అవినీతి, ఆరోపణలు వెల్లువెత్తాయి. భవనాల విషయంలో బాగానే వసూలు చేశారనే ఆరోపణలున్నాయి. అక్రమ భవనాలపైతాజాగా జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆరా తీశారు. డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, కార్పొరేటర్ సాకే చంద్రశేఖర్ శ్రీనివాసులుపై విమర్శిం చారు. శ్రీనివాసులును ఇక్కడి నుంచి పంపించివేయాలని కోరారు. ఈ క్రమంలో ఏసీపీ శ్రీనివాసులు దీర్ఘకాలిక సెలవులోకి వెళ్లడం చర్చనీయాంశంగా మారింది.

ఆస్పత్రి సూపరింటెండెంట్ మూడు రోజుల సెలవు

అనంతపురం టౌన్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లా సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వరరావు మూడు రోజులు సెలవులో వెళ్లారు. ఆయన తన వ్యక్తిగత పనిమీద మంగళవారం నుంచి ఈ నెల 25వరకు సెలవులో వెళ్లారు. తిరిగి ఈ నెల 26వ తేదీన విధుల్లో చేరనున్నారు. అప్పటివరకు డాక్టరు ఆత్మారామ్ ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్‌గా వ్యవహరించనున్నారు.

సీపీఐ శత వసంతాల ప్రత్యేక సంచిక ఆవిష్కరణ


ఆవిష్కరిస్తున్న నాయకులు

అనంతపురం విద్య, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ శత వసంతాల ప్రత్యేక సంచికను ఆ పార్టీ నాయకులు ఆవిష్కరించారు. సీపీఐ స్థానిక కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి జాఫర్, ఇతర నేతలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాఫర్ మాట్లాడుతూ... కమ్యూనిస్టు పార్టీని 1925 డిసెంబరు 26న ఉత్తరప్రదేశ్ లోని కాన్పూర్‌లో ప్రారంభించారన్నారు. ఈ నెల 26న అన్ని కేంద్రాల్లో జార్టీ జెండాలు రెపరెపలాడాలన్నారు. అంబేడ్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలపై ఈ నెల 31 వరకు నిరసన తెలుపుతామన్నారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణ స్వామి, ఇతర నేతలు చిన్న తిరుపతయ్య, ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా లా పరీక్షలు

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూ ఆధ్వర్యంలో లా కోర్సు పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్(ఈసీ) డాక్టర్ లోకేష్ పేర్కొన్నారు. వర్సిటిలోని ఫార్మసి, ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన పరీక్షా కేంద్రాలను మంగళవారం సీఈ లోకేష్, డీఈ ప్రొఫెసర్ జీవీ రమణ వేరువేరుగా పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్కేయూ ఆధ్వర్యంలోని న్యాయ వాద విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు సోమవారం నుంచి ఈ నెల 30వరకు పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఎస్కేయూ క్యాంపస్ లా డిపార్ట్‌మెంట్‌తో పాటు విజయ నగర లా కాలేజ్ విద్యార్థులకు ఏకకాలంలో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఐదు సంవత్సరాల బీబీఏ, బీకామ్ ఎల్ఎల్‌బీ ద్వితీయ, నాల్గవ సెమిస్టర్ విద్యార్థులకు. ఎల్ఎల్ఎం ద్వితీయ సెమిస్టర్ విద్యార్థులకు ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లుగా పరీక్షలు ఏర్పాటుచేశామని తెలిపారు. మాస్ కాపీయింగ్‌కు పాల్పడిన ఒక విద్యార్థిని మంగళవారం డీబార్ చేసినట్లు పేర్కొన్నారు.

నగరంలో క్రిస్మస్ వేడుకలు



నగరంలోని కార్మెలుమాత చర్చిలో అర్ధరాత్రి ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు, పాల్గొన్న శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ రత్న

27న ప్రజావేదిక

నార్పల, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 27న బహిరంగ ప్రజా వేదిక నిర్వహిస్తున్న ట్లు ఎంపీడీఓ గంగావతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధి హామీ పథకం కింద మండలంలోని 17 గ్రామ పంచాయతీలలో చేపట్టిన పనులపై 17వ విడత సామాజిక తనిఖీ జరిగిందన్నారు. 2023, ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు గ్రామాలలో చేసిన పనులను సామాజిక తనిఖీ బృందం సభ్యులు పరిశీలించారని తెలిపారు. ఆ బృందం తయారు చేసిన నివేదికలను ఈ నెల 27న ఉదయం 10గంటలకు జరిగే ప్రజా వేదికలో చదవి వినిపిస్తారని ఎంపీడీఓ తెలిపారు.

అర్బన్ బ్యాంకులో సెమీ క్రిస్మస్ వేడుకలు


అర్బన్‌బ్యాంకులో పాల్గొన్న చైర్మన్, సీఈఓ, పాలకవర్గ సభ్యులు, ఉద్యోగులు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక అర్బన్ బ్యాంకులో ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. స్థానిక శ్రీకృష్ణదేవరాయభవన్ అర్బన్‌బ్యాంకులో మంగళవారం సెమీ క్రిస్మస్ వేడుకల్లో భాగంగా పాస్టర్ సురేష్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చైర్మన్ జేఎల్ మురళీధర్ కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ప్రజలకు చీకటి నుంచి వెలుగుపంచడమే తన జీవితపరమార్థమని యేసు పేర్కొన్నట్లు వివరించారు. అనంతరం క్రిస్మస్ ట్రీ, స్టార్ వెలిగించి క్రిస్మస్ తాతా ప్రదర్శనలతో చిన్నారుల ప్రదర్శన ఆకట్టుకుంది. బ్యాంకు సీఈఓ విజయభాస్కర్, వైస్‌చైర్మన్ గోల్డ్‌బాషా, డైరెక్టర్లు సుంకర రమేష్, రామాంజినేయులు, రొళ్ల భాస్కర్, చింతా భాస్కర్, రమణయ్య, మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల్లో క్రిస్మస్ కోలాహలం


మాంటిస్సోరి స్కూల్‌లో..


మినర్వా స్కూల్‌లో....

అనంతపురం విద్య, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు స్కూళ్లలో మంగళవారం క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. చిన్నారులు శాంతాక్లాజ్, జీసస్ వేషధారణల్లో హాజరై సందడి చేశారు. క్రీస్తు జననంపై స్కూళ్లలో నాటికలు ప్రదర్శించారు. రాంనగర్‌లోని బచ్‌పన్ స్కూల్‌లో స్కూల్ చైర్మన్ షాలి దాదా గాంధీ ఆధ్వర్యంలో, కోర్టు రోడ్డు శ్రీచైతన్య స్కూల్‌లో ఏజీఎం సుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ తబస్సుమ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గుత్తిరోడ్డు, సంగమేష్ సర్కిల్‌లోని మాంటిస్సోరి విద్యాసంస్థల్లో, మినర్వా స్కూల్‌లో కరస్పాండెంట్ భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలను చిన్నారుల నడుమ ఘనంగా నిర్వహించారు.

● అనంతపురం రూరల్: మండలంలోని కొడిమి గ్రామ సమీపంలోని ఎరా ఇంటర్నేషనల్ స్కూల్‌లో విద్యార్థులు యేసు జీవిత చరిత్ర నాటకం ప్రదర్శించారు. యేసు ప్రార్థనలు, నృత్యాలతో అలరించారు. పాఠశాల చైర్మన్ అరుణ్‌కుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి తదతరులు పాల్గొన్నారు.


బచ్‌పన్ స్కూల్‌లో..


కోర్టు రోడ్డు శ్రీచైతన్య స్కూల్‌లో..


ఎరా ఇంటర్నేషనల్ స్కూల్‌లో..

కేంద్రమంత్రి వాఖ్యలపై ఆందోళనలు

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అనుచిత వాఖ్యలు చేశారంటూ పలు ప్రజా సంఘాలు, పార్టీలు వాటి ఆందోళనలను కొన సాగిస్తున్నాయి. బీఎస్పీ ఆధ్వర్యంలో మంగళవారం నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. అదేవిధంగా క్లాక్‌టవర్ నుంచి జైభీమ్ పార్టీ ర్యాలీ నిర్వహించింది. బీఎస్పీ నిరసన కార్యక్రమానికి ఆ పార్టీ జాతీయ కో ఆర్డినేటర్ బాలయ్య, బహుజన లాయర్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు అడ్వకేట్ నారాయణప్ప ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. అంబేడ్కర్‌పై బీజేపీకి, నరేంద్రమోదీకి గౌరవముంటే కేంద్రమంత్రి పదవి నుంచి అమిత్‌షాను తొలగించాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో అంబేడ్కర్‌ను అవమానించిన బీజే పీ కేంద్ర ప్రభుత్వాన్ని రద్దుచేయాలని జైభీమ్‌రావ్ పార్టీ(జేబీపీ) జిల్లా యూత్ అధ్యక్షుడు చందునాయక్ డిమాండ్‌చేశారు. కేంద్ర మంత్రిగా అమిత్‌షాను బర్త రఫ్ చేయాలని జేబీపీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు గోవింద్ నాయక్, నాగరాజు, వెంకటేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురిపై కేసు

అనంతపురం క్రైం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఓ వ్యక్తిపై జరిగిన దాడి ఘట నపై వన్‌టౌన్ పోలీసులు ము గ్గురిపై కేసు నమోదు చేశారు. కమలానగర్‌లో ఈనెల 8వ తేదీ తలారి నగరాజు తన సోద రి ఇంట్లో ఉండగా కొందరు దాడి చేశారు. ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు లక్ష్మి, జితేంద్ర, మరో వ్యక్తిపై కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా..

బాల్య వివాహాలు నేరం

ఉరవకొండ, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని సీడీపీఓ శ్రీదేవి అన్నారు. పట్టణంలోని వీరశైవ కల్యాణ మండపంలో మంగళవారం కిశోర వికాసంను నిర్వహించారు. ఎంపీడీఓ రవిప్రసాద్, ఎంఈఓ- 2 రమాదేవి, సీడీపీఓ శ్రీదేవి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. అనంతపురం జిల్లాను బాల్య వివాహాల రహిత జిల్లాగా చేయడానికి అందరం సమష్టిగా కృషి చేయాలన్నారు. కనుక ప్రతిఒక్కరూ బాల్య వివాహాలు జరగకుండా చూడాలని సూచించారు. సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయండి

ఉరవకొండ, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలను విజయవంతం చేయాలని ఆ ఫెడరేషన్ నాయకుడు రామప్ప చౌదరి కోరారు. పట్టణంలోని ఆ యూనియన్ కార్యాలయం వద్ద మంగళవారం మహాసభ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఏడాది జనవరి 5 నుంచి 8వ తేదీ వరకూ కాకినాడలో రాష్ట్ర స్వర్ణోత్సవ మహాసభలు జరుగుతాయన్నారు. అందులో భాగంగా ఈ నెల 26న యూటీఎఫ్ స్వర్ణోత్సవ ప్రచార జాతా గుంతకల్లులో ప్రారంభమై ఉరవకొండ, రాయదుర్గం, కల్యాణదుర్గం, అనంతపురం మీదుగా రాప్తాడుకు చేరుకుంటుందన్నారు. ఈ ప్రచార జాతాకు ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరవ్వాలని కోరారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

జిల్లా మహాసభల పోస్టర్ల విడుదల

రాయదుర్గంరూరల్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలో జనవరి 7వ తేదీన నిర్వహించే ఏఐఎస్ఎఫ్ 20వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి సంతోష్‌కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక ఎన్‌జీఓ భవనంలో మంగళవారం మహాసభలకు సంబంధించి పోస్టర్లను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. యువత, విద్యార్థి సంఘం నాయకులు, మేధావులు, ప్రజాసంఘాల నాయకులు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు. జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్‌కృష్ణ, జిల్లా నాయకులు దేవేంద్ర, కొట్రేష్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్ పాయిజన్‌తో అస్వస్థత

ఉరవకొండ, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఫుడ్ పాయిజన్‌తో 20మందికి పైగా అస్వస్థతకు గురయ్యారు. స్థానిక దుర్గాభవాని ఆలయంలో గత సోమవారం ఇరుముడి కార్యక్రమానికి సత్యనారాయణ పేట, కొండ ప్రాంతానికి చెందిన భక్తులు హాజరయ్యారు. కాగా ఓ భక్తుడు అల్పాహారంగా ఉగ్గాని, మిర్చీబజ్జీలను ఏర్పాటు చేశారు. వాటిని తిన్న భక్తులకు వాంతులు, విరేచనాలు అయ్యాయి. కొందరు బాధితులు కామేశ్వరి, మమత, జ్యోతి, గోవిందమ్మ, అంజినమ్మ, రమేష్ ప్రభుత్వ ఆసుపత్రిలో చేరి చికిత్స పొందారు.

28న సమావేశానికి రండి

గుమ్మఘట్ట, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని బీటీప్రాజెక్టు పరిధిలోని కుడి, ఎడమ కాలువల పరిధిలో గల ఆయకట్టు రైతులు ఈ నెల 28న బీటీప్రాజెక్టులో జరిగే సమావేశానికి హాజరు కావాలని ఆ ప్రాజెక్టు చైర్మెన్ కాలవ నాగరాజు మంగళవారం పిలుపునిచ్చారు. ప్రాజెక్టు పరిధిలోని కుడి, ఎడమ కాలువల పరిధిలో ఆయకట్టు రైతులకు రబీసీజన్‌లో పంటల సాగు చేసుకునేందుకు నీటి విడుదలపై చర్చించేందుకు హాజరు కావాల్సిందిగా ఆయన కోరారు. ముఖ్యఅతిథులుగా రాయదుర్గం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే సురేంద్రబాబు, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణతో పాటు ఇరిగేషన్ అధికారులు హాజరవుతున్నట్లు వెల్లడించారు.

హనకనహాళ్ విద్యార్థిని ప్రతిభ

కణేకల్లు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని హనకనహాళ్ జెడ్పీ హైస్కూల్లో తొమ్మిదో తరగతి చదువుతున్న గీతారెడ్డి వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చూపి జిల్లాస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచింది. జిల్లా కేంద్రంలోని సైన్స్‌సెంటర్‌లో మంగళవారం నిర్వహించిన వర్చువల్ ఇయరింగ్ అండ్ డిజిటల్ యాక్సెస్ కంజుమర్ జస్టిస్ అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలలో ఆమె ప్రథమస్థానంలో రాణించింది. ప్రశంసాపత్రంతో పాటు రూ. మూడు వేల నగదు ను అందజేశారు. అలాగే ఇదే అంశంపై నిర్వహించిన జిల్లాస్థాయి వక్తృత్వపు పోటీలలో ఇదే పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి గణేష్‌రెడ్డి ద్వితీయస్థానంలో నిలిచి రూ. రెండు వేల నగదుతో పాటు ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. విజేతలకు హెచ్ఎం వేణుగోపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

గోనెసంచుల కోసం రైతుల ఆందోళన

బొమ్మనహాళ్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): గోనెసంచులు పంపిణీ చేయాలని మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలోని సొసైటీలో రైతులు మంగళవారం ఆందోళన చేపట్టారు. కురవళ్లి, ఉంతకల్లు గ్రామాలకు చెందిన కొందరు రైతులు సొసైటీలో ఖాళీగోనెసంచులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఐదురోజులుగా ఖాళీసంచులు ఇవ్వాలని కోరినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంకా ఎన్ని రోజులు ధాన్యాన్ని కల్లాలో ఉంచాలని మండిపడ్డారు. ఒక పక్క వర్షాల భయం వెంటాడుతోందని, వెంటనే తమకు సంచులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంచుల కొరత కారణంగా ఇవ్వలేకపోతున్నామని, 29,350 బ్యాగులు మాత్రమే వచ్చాయని ఇప్పటివరకు 27,322 సంచులు ధాన్యంతో పంపించినట్లు సీఈఓ హనుమంతు చెప్పారు. నేడు రైతులందరికీ పంపిణీ చేస్తామని, ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సీఈఓ పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల తనిఖీ

బొమ్మనహాళ్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీధరఘట్ట, ఉద్దేహాళ్ సొసైటీల ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం రాయదుర్గం వ్యవసాయశాఖ ఏడీఏ లక్ష్మానాయక్ తనిఖీ చేశారు. ఉద్దేహాళ్ సొసైటీ ద్వారా 1992 మెట్రిక్ టన్నులు, శ్రీధరఘట్ట సొసైటీ ద్వారా 1234 మెట్రిక్‌టన్నుల వరిధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఖాళీసంచులు రాలేదని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అందరికీ ఖాళీ సంచులు అందించి ధాన్యం కొనుగోలు చేస్తామని అన్నారు. దళారులకు నమ్మి మోసపోవద్దన్నారు. ఏఓ సాయికుమార్, పీఈఓలు నాగరాజు, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయానికి తాళం..

● పనుల నిమిత్తం వచ్చిన ప్రజలు నిరాశతో వెనుదిగిరిన వైనం



మూతపడిన సచివాలయం

కుందుర్పి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని కరిగానపల్లి సచివాలయ సిబ్బంది ఎవరూ విధులకు హాజరుకాకపోవడంతో మంగళవారం తలుపులు మూసుకున్నాయి. అగ్రికల్చర్ అసిస్టెంట్, సర్వేయర్, గ్రామ పశువైద్య సహాయకుడు మాత్రమే హాజరై ఫీల్డ్ మీద వెళ్లారు. ఇక ఎవరూ రాకపోవడంతో వారు సచివాలయానికి తలుపులు వేసుకుని వెళ్లాల్సి వచ్చింది. వివిధ పనుల నిమిత్తం వచ్చిన ప్రజలు తాళం వేసి ఉండడాన్ని చూసి నిరాశతో వెనుదిరిగారు.

సౌత్‌జోన్ గేమ్స్‌కు కేటీఎస్ విద్యార్థులు

రాయదుర్గంరూరల్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు నిషార్‌అహ్మద్, రఘు, గోపి సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్శిటీ గేమ్స్‌కు శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ తరఫున ఖోఖో జట్టుకు ఎంపికైనట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. కళాశాలలో సమావేశం నిర్వహించి క్రీడాకారులను అభినందించారు. కళాశాలకు చెందిన ముగ్గురు క్రీడాకారులు డిసెంబరు 26 నుంచి 31 వరకు తమిళనాడులోని తిరువాయూర్‌లో సెంట్రల్ యూనివర్శిటీ ఖోఖో జట్టులో ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. కళాశాల నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపిక కావడం అభినందనీయమని అన్నారు. ఎన్‌సీసీ సీటీఓ కిరణ్, వ్యాయామ అధ్యాపకుడు ప్రశాంత్, రిటైర్డ్ హెచ్‌ఎం సత్యనారాయణ, అధ్యాపకులు ఆ విద్యార్థులను అభినందించారు.

రాయదుర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తా

● కౌన్సిల్ సమావేశంలో ప్రభుత్వ విప్ కాలవ
● ఏకగ్రీవంగా బడ్జెట్ ఆమోదం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కాలవ

రాయదుర్గంటౌన్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): రాయదుర్గం పట్టణాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. పట్టణంలోని పురపాలక సంఘం కార్యాలయంలో మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప అధ్యక్షతన బడ్జెట్ ప్రత్యేక సమావేశం జరిగింది. విప్ కాలవ శ్రీనివాసులు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బడ్జెట్‌ను మున్సిపల్ పాలకవర్గం ఏకగ్రీవంగా తీర్మానించింది. అదే విధంగా సాధారణ సమావేశంలోని అజెండా అంశాలను సైతం ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సందర్భంగా కాలవ శ్రీనివాసులు మాట్లాడారు. భవిష్యత్తు తరాలు హర్షించే విధంగా రాయదుర్గం పట్టణాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని అన్నారు. ఇందుకు సుదీర్ఘమైన ప్రణాళికతో ముందుకు వెళతామన్నారు. ఉడేగోళం నుంచి బళ్లారి బైపాస్ వరకు హాఫ్‌రింగ్ రోడ్డు నిర్మాణం పనులు పూర్తయితే ట్రాఫిక్ సమస్య పరిష్కారం కావడంతో పాటు రాయదుర్గం పట్టణ రూపురేఖలు మారుతాయన్నారు. మున్సిపల్ పాలకవర్గంతో పాటు వ్యాపారులు , ప్రజలు సహకరిస్తే బళ్లారిరోడ్డు విస్తరణ పనులు చేపడతామన్నారు. పాత మున్సిపల్ కార్యాలయాన్ని తొలగించి దాని స్థానంలో ఆకర్షణీయమైన వాణిజ్య సముదాయ భవన నిర్మాణానికి కృషి చేస్తామని తెలిపారు. పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కరించడంతో పాటు వీధిదీపాల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే ప్రతిపాదించిన బళ్లారిరోడ్డు ప్రధాన రహదారి విస్తరణకు కౌన్సిల్ పాలకవర్గం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, మున్సిపల్ అధికారులు, కౌన్సిల్ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, అర్బన్ సీఐ జయనాయక్ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్ ఆమోదం

రాయదుర్గం పురపాలక సంఘం ఆర్థిక సంవత్సరం 2024-25నకు సవరించిన బడ్జెట్ అంచనాలను, ఆర్థిక సంవత్సరం 2025-26నకు మున్సిపల్ అధికారులు తయారుచేసిన బడ్జెట్ అంచనాలను కౌన్సిల్ పాలకవర్గం ఏకగ్రీవంగా ఆమోదించింది. 2025-26 వ ఆర్థిక సంవత్సరానికి అన్ని పద్ధతుల కింద సాధారణ, మూలధన రాబడి ప్రారంభ నిలువతో సహా రాబడి ఖర్చులు కలిపి సుమారు రూ. 36.30 కోట్లతో బడ్జెట్ అంచనాను ఆమోదించారు. మొత్తం రూ. 36.30 కోట్ల అంచనాతో తయారైన బడ్జెట్‌లో రూ. 35.31 కోట్లు ఖర్చు చూపి రూ. 98.44 లక్షలు ముగింపు నిలువగా బడ్జెట్‌లో పేర్కొన్నారు.

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

● మున్సిపల్ చైర్మన్ జేసీపీఆర్

తాడిపత్రి, డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని కడపరోడ్డులో గల చర్చి స్కూల్ ఆవరణలో మంగళవారం ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాల ఆధ్వర్యంలో క్రీడాపోటీలు జరిగాయి. ముఖ్యఅతిథిగా జేసీ ప్రభాకర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. విద్యారులు క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించాలని, సమాజంలో జరుగుతున్న పరిణామాలపై అవగాహన కలిగి ఉండాని తెలిపారు. వారికి తల్లిదండ్రులు దూరదృష్టితో జీవితంలో ఎలా బతకాలో నేర్పించాలని సూచించారు. క్రీడల్లో కూడా విద్యార్థులు రాణించాలని, క్రీడల వల్ల శారీరక ధృడత్వం, మానసిక ఉల్లాసం కలుగుతాయని పేర్కొన్నారు.

బ్యానర్లు కట్టకండి..

క్రిస్మస్ పండుగ, నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని జేసీ ఫ్యామిలీకి శుభాకాంక్షలు అంటూ ఎవరూ ఎలాంటి బ్యానర్లు, ఫ్లెక్సీలు కట్టవద్దని, డబ్బులను వృథా చేయవద్దని, వాటిని ఏదేని అభివృద్ధి పనులకు వినియోగించాలని జేసీ ప్రభాకర్‌రెడ్డి సూచించారు. స్థానిక నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పండగ, నూతన సంవత్సరం అంటూ ఎవరూ బ్యానర్లు కట్టరాదని, అలాగే పుష్పగుచ్ఛాలు తీసుకురావొద్దని తెలిపారు. జనవరి 1నుంచి పట్టణంలో ఎక్కడా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయరాదన్నారు. అలా చేసుకోవాలంటే మున్సిపల్ స్థలాలు ఏర్పాటు చేస్తాం అక్కడ మాత్రమే కట్టుకోవాలని తెలిపారు. న్యూ ఇయర్ సందర్భంగా 31న రాత్రి 7గంటల నుంచి 1గంట వరకు జేసీ పార్కులో వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో మహిళలు, చిన్నారులు, వృద్ధులకు మాత్రమే అనుమతి ఉంటుందని చెప్పారు. ఇక్కడ స్టాల్స్‌ను కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందని ఎవరూ ఎలాంటి ఇబ్బందులు పడకుండా అన్ని ఏర్పాట్లను చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.



మాట్లాడుతున్న జేసీ ప్రభాకర్‌రెడ్డి

మట్టి అక్రమ రవాణా చేస్తున్న టిప్పర్లు సీజ్

యాడికి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): రాయలచెరువు గ్రామంలోని చెరువులో మట్టిని అక్రమ రవాణా చేస్తున్న రెండు టిప్పర్లను మంగళవారం సీజ్‌చేసి కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ వెంకటరమణయ్య తెలిపారు. రాయలచెరువు గ్రామంలోని చెరువులో మట్టి అక్రమ రవాణా చేస్తున్నట్లు సమాచారం అందడంతో వెంటనే జలవనరులశాఖ ఏఈ నూర్జహాన్, రాయలచెరువు వీఆర్వో కుమారస్వామి చెరువు వద్దకు వెళ్లి పరిశీలించారన్నారు. అక్కడ మట్టి లోడింగ్ చేసిన రెండు టిప్పర్లను గుర్తించి సీజ్ చేశారన్నారు. తర్వాత జలవనరుల శాఖ ఏఈ, రాయలచెరువు వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఆ టిప్పర్లను పోలీస్‌స్టేషన్ వద్దకు తరలించారు.

చెరువు మట్టిపై రాజకీయం తగదు

రాయలచెరువులోని చెరువుమట్టిపై వైసీపీ నాయకులు రాజకీయం చేయడం తగదని పలువురు రైతులు తెలిపారు. చెరువులో మట్టిని రైతులు టిప్పర్లతో పొలాలకు తోలుకుంటుండగా అధికారులు సీజ్‌చేయడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాయలచెరువులో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. వైసీపీ నాయకులు అధికారులకు ఫిర్యాదుచేసి చెరువుమట్టి రవాణాను అడ్డుకోవడం తగదన్నారు. రాజకీయాలకు అతీతంగా చెరువుమట్టిని తోలుకొని పొలాలను సారవంతం చేసుకుంటున్నామని తెలిపారు. చెరువు మట్టి లేకపోతే రాయలచెరువులో అరటిపంటలు పండేవి కాదని అన్నారు. అధిక ధరలు వెచ్చించి ఎరువులు కొనలేక చెరువుమట్టి సొంత ఖర్చులతో తోలుకుంటున్నామని తెలిపారు. వైసీపీ నాయకులు స్వార్థప్రయోజనాల కోసం చెరువుమట్టిని రైతులు తోలుకోకుండా నిలిపివేయడం మంచిపద్ధతి కాదని హితవు పలికారు. సమావేశంలో రైతులు సత్యనారాయణరెడ్డి, మహబూబ్‌పీరా, చంద్రన్న, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల పరిశీలన



మామిడి తోటను పరిశీలిస్తున్న అధికారులు

కుందుర్పి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా ఉద్యానవన పంటలు తెగుళ్ల బారిన పడి రైతులు ఇబ్బంది పడుతుండడంపై ఆంధ్రజ్యోతిలో మంగళవారం తెగుళ్లతో తంటాలు అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించి ఉద్యానవన శాఖ అధికారి గౌసియా వెంటనే కరిగానపల్లిలో రైతులు సాగు చేసిన మామిడి, టమోటా పరిశీలించారు. మామిడిలో చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన సూచనలను సలహాలను రైతులకు అందించారు. ఆమె వెంట పాటు విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ విజయశాంతి ఉన్నారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ



పెద్దపప్పూరులో పోలీస్ సిబ్బందితో ఎస్పీ జగదీశ్

పెద్దపప్పూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ జగదీష్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడి సిబ్బందితో మాట్లాడుతూ సమస్యాత్మకమైన గ్రామాల్లో నిరంతరం ప్రత్యేక ని ఘా ఉంచాలని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వారిపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. తాడిపత్రి డీఎస్పీ రామకృష్ణుడు, పెద్దవడుగూరు సీఐ రామసుబ్బయ్య, ఎస్ఐ నాగేంద్రప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దవడుగూరు: మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ తనిఖీచేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం పెండింగ్ కేసుల వివరాలను తెలుసుకుని తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. ఆయన వెంట సీఐ వెంకటసుబ్బయ్య, ఎస్ఐ ఆంజనేయులు, సిబ్బంది ఉన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

కణేకల్లు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని తుంబిగనూరు గ్రామానికి చెందిన ఎన్నప్పను అరెస్టు చేసి కర్ణాటకకు చెందిన 90 మద్యం టెట్రాప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ ఉమాబాయి తెలిపారు. మంగళవారం తమ సిబ్బంది చేసిన తనిఖీల్లో ఎన్నప్ప అక్రమంగా కర్ణాటక మద్యం కలిగి ఉన్నట్లు తెలిసిందన్నారు. వెంటనే స్వాధీనం చేసుకుని, అతన్ని పట్టుకుని అరెస్టు చేశామన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

భీమిరెడ్డి కాలనీలో చోరీ

గుంతకల్లు టౌన్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని భీమిరెడ్డి కాలనీలో నివాసముంటున్న మహమ్మద్ ఇంట్లో సోమవారం రాత్రి చోరీ జరిగింది. మహమ్మద్ పట్టణంలో ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి ఇంటికి తాళం వేసి కథల గేరిలో అత్తారింటికి వెళ్లాడు. ఉదయం ఇంటికి వచ్చి చూడగా తాళాలు తెరచి ఉన్నాయని, దుండగులు ఇంట్లోకి చొరబడి బీరువా తాళాలు పగలగొట్టి రెండున్నర తులాల బంగారు నగలు, కేజీ వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారని బాధితుడు తెలిపాడు. విషయంపై రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు మహమ్మద్ తెలిపాడు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు

కళ్యాణదుర్గం క్రీడాకారుల విజయఢంకా

కళ్యాణదుర్గం రూరల్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా స్థాయిలో జరిగిన అండర్-14 హాకీ పోటీల్లో కళ్యాణదుర్గం క్రీడాకారులు విజయఢంకా మోగించారు. మంగళవారం అనంతపురంలోని ఆర్డీటీ స్టేడియంలో జరిగిన బాలుర విభాగంలో అండర్-14 హాకీ ఫైనల్ మ్యాచ్‌లో కళ్యాణదుర్గం టీం విజయం సాధించారు. కార్యక్రమంలో ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ, జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్, జిల్లా అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి అక్రమ్ బాషా, హాకీ కోచ్ అఖిల, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆ డ్రైవర్ గురించి ఆరా

పుట్లూరు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ డ్రైవర్‌పై జిల్లా ఉన్నతాధికారులు ఆరాతీసినట్లు సమాచారం. కార్యాలయంలో ఆ డ్రైవర్ తహసీల్దార్ కుర్చీ పక్కనే కుర్చీ వేసుకుని దర్జాగా కూర్చోవడంపై మంగళవారం ఆంధ్రజ్యోతిలో సారుగారి డ్రైవర్ గారు అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఇందుకు ఉన్నతాధికారులు స్పందించి సదరు డ్రైవర్ గురించి ఆరాతీసినట్లు తెలుస్తోంది. అధికార దర్పం చూపించిన డ్రైవర్‌పై కార్యాలయంలోని ఓ అధికారి ఉన్నతాధికారుల వద్ద వెనకేసుకు వచ్చినట్లు తెలిసింది. డ్రైవర్లకు గదులు అంటూ ఏమి ఉండవు కదా.. అధికారులు లేనిచోటే వారు కూర్చొంటారంటూ చెప్పుకు రావడం పలు విమర్శలకు తావిస్తోంది. ఆ డ్రైవర్‌పై ఆ అధికారికి ఎందుకంత ప్రేమో అర్థం కావడం లేదు. కానీ ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచిచూడాల్సిందే.

చిల్లర దుకాణాల్లో..

రాయదుర్గంరూరల్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శాంతినగర్ చివరన రెండు చిల్లర దుకాణాల్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు వాటి యజమానులు దుర్గప్ప, వెంకటేశులు మంగళవారం తెలిపారు. స్థానిక బళ్లారిరోడ్డులో వేర్వేరుగా ఉన్న ఆ దుకాణాలను వారు మూసేసి ఇళ్లకు వెళ్లిపోయారు. మంగళవారం ఉదయం షాపులు తెరిచేందుకు రాగా చోరీ జరిగినట్లు గుర్తించారు. గుర్తు తెలియని దుండగులు షెడ్డుకు వెనుక వైపు ఉన్న రేకులు కత్తిరించి లోపలికి చొరబడి సిగరెట్ బాక్సులు, సబ్బులు, కూల్‌డ్రింక్‌లు, క్యాష్‌బాక్సులోని కొంత నగదు, ఇతర సరుకులు చోరీ చేశారని బాధితులు తెలిపారు. తన షాపులో మూడోసారి ఇలా చోరి జరిగిందని దుర్గప్ప వాపోయారు. పోలీసులు ఇలాంటి దొంగతనాలు చేసే వారిపై నిఘా ఉంచి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్లు వారు తెలిపారు.

క్రిస్మస్‌కు చర్చిల ముస్తాబు



గుంతకల్లులో విద్యుదాలంకరణలో చర్చి

గుంతకల్లుటౌన్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి):క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని పట్టణంలోని ఆరోగ్య మాత పుణ్యక్షేత్రం, సీఎస్ఐ, గంట చర్చితో పాటు పలు చర్చిలను మంగళవారం ముస్తాబు చేశారు. ఏసు క్రీస్తు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు చర్చిల నిర్వాహకులు అన్ని ఏర్పాట్లను చేశారు. విద్యుత్ దీపాలతో చర్చిలను సర్వాంగ సుందరంగా అలంకరించారు. అర్ధరాత్రి నుంచి చర్చిల్లో పాస్టర్లు ప్రార్థనలు చేయనున్నారు.

పాఠశాలల్లో వేడుకలు..

పామిడి/ గుంతకల్లు టౌన్: పామిడి పట్టణంలోని నలంద పాఠశాలలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు వివిధ వేషధారణలో చేపట్టిన పరమత సహనం అనే నాటక ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. పాఠశాల డైరెక్టర్ ఎండీ రవి, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే గుంతకల్లు పట్టణంలోని కొనకొండ్ల రోడ్డులో గల వివేకానంద ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాలలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

పూర్వవిద్యార్థుల సమ్మేళనం



నాటి గురువులతో పూర్వవిద్యార్థులు

కణేకల్లు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 47 ఏళ్ల క్రితం విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు మంగళవారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. 1976-77 వ విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన దాదాపు 40 మంది పూర్వవిద్యార్థులు ఒకచోట కలుసుకున్నారు. ఈ సందర్భంగా నాటి గురువులు రామప్ప, నాగరాజు, నాగప్పశెట్టిను శాలువాలు, పూల మాలలతో సన్మానించారు. నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు.

ఆటో బోల్తా.. ఏడుగురికి గాయాలు

ఉరవకొండ, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మేజర్ పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం ఆటో అదుపుతప్పి బోల్తా పడడంతో ఏడుగురికి గాయాలయ్యాయి. ఉరవకొండ నుంచి ఆటో ప్రయాణికులతో గడేహోతూరుకు బయలుదేరింది. పంచాయతీ కార్యాలయం వద్దకు రాగానే ద్విచక్రవాహనం అడ్డురావడంతో తప్పించబోయి అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో అందులో ప్రయాణిస్తున్న గడే పెద్దహోతూరు, హోతూరు గ్రామాలకు చెందిన లక్ష్మి, నందిని, ఎర్రమ్మ, రామలక్ష్మి, కవిత, అక్షయ, చిన్న సుహేంద్రి, మౌనిక గాయపడ్డారు. వారిని స్థానికులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎర్రమ్మ, లక్ష్మి, మౌనికకు తీవ్రగాయాలు కాగా మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు. విషయం తెలుసుకున్న మంత్రి పయ్యావుల కేశవ్ జిల్లా వైద్యాధికారులతో ఫోన్‌లో మాట్లాడి క్షతగాత్రులకు మెరుగైన వైద్యసేవలందించాలని సూచించారు.

పప్పుశనగ రైతులను ఆదుకోవాలి

యాడికి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలతో పంటలను నష్టపోయిన పప్పుశనగ రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటరాముడు యాదవ్ కోరారు. మండలంలో పంట నష్టం జరిగిన పప్పుశనగ పొలాలను రైతు సంఘం నాయకులు మంగళవారం పరిశీలించారు. పంట నష్టంపై రైతుల నుంచి వివరాలు ఆరాతీశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మాట్లాడుతూ.. మండలంలో 2500హెక్టార్లలో రైతులు పప్పుశనగ సాగుచేశారన్నారు. అయితే తుఫాన్ ప్రభావం వల్ల అకాల వర్షాలతో పూత, పులుపు పోయిందని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో పప్పుశనగ దిగుబడి ఎకరాకు రెండు క్వింటాళ్లు కూడా వచ్చే పరిస్థితులు లేవన్నారు. దీంతో ఆయా రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. వారిని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని డిమాండ్‌చేశారు. రైతు సంఘం నాయకులు శ్రీరాములు, ఓబిరెడ్డి, సీపీఐ నాయకులు శివన్న, ఆదినారాయణ, వడ్డెరాముడు, చిన్న కుళ్లాయి రెడ్డి తదితరులు ఉన్నారు.

పశువైద్యశాల తనిఖీ

శెట్టూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఏరియా పశువైద్యశాల, చెర్లోపల్లి, బాచుపల్లి రైతు సేవా కేంద్రాలను ఉరవకొండ పశు వైద్య శాఖ డీడీ వెంకటేశం మంగళవారం తనిఖీ చేశారు. పశువులకు సీజనల్ వ్యాధులు వ్యాపిస్తే ఎప్పటికప్పుడు చికిత్స చేయాలని సిబ్బందికి సూచించారు. ఏడీ నాగలింగేశ్వర రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.